నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 5-9-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:30 పేజీలు: 4 వెల: రూ.1/-

ఖాకీ దుస్తులను చూసి గర్వపడాలి

అంకితభావం తప్ప అహంభావం ఉండకూడదు
కరోనాలో పోలీసుల సేవలు ప్రశంసనీయం
నిరంతర యోగాతో ఒత్తడిని జయించాలి
ఐపీఎస్‌ల పాసింగ్ ఔట్ పరేడ్‌లో ప్రధాని మోడీ సందేశం

హైదరాబాద్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): ఖాకీ దుస్తులను చూసి గర్వపడాలి తప్ప అహంభావం ఉండకూడదని ప్రధాని మోదీ అన్నారు. కరోనా కట్టడిలో పోలీసులు ముందుండి పోరాడుతున్నారని కితాబిచ్చారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో నిర్వహించిన ఐపీఎస్‌ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని మాట్లాడారు. జాతీయ పోలీస్ అకాడమీలో శుక్రవారం 131 మంది ఐపీఎస్‌ల పాసింగ్ ఔట్ పరేడ్ జరిగింది. ప్రొబేషనరీ ఐపీఎస్‌లను ఉద్దేశించి స్ఫూర్తిదాయక సందేశమిచ్చారు. యోగా, ప్రాణాయామం ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలని అన్నారు. మీరు మీ గుండె నుంచి ఏ పని చేసినా.. దాని వల్ల మీరు లబ్ది పొందుతారన్నారు. ఎంత పని ఉన్నా.. మీరు వత్తిడికి లోనుకారని ప్రధాని తన సందేశంలో తెలిపారు. మనసులోనూ యోగా చేయడం చాలా మంచి పద్ధతని చెప్పారు. ప్రజా సేవలో ఉండే అధికారులు ఆరోగ్యంగా ఉండాలని ప్రధాని మోదీ తెలిపారు. పనిభారం, ఒత్తిడి ప్రభావం ఆరోగ్యంపై పడకుండా చిట్కాలు పాటించాలన్నారు. కరోనా సంకట పరిస్థితుల్లో పోలీసుల సేవలు ప్రశంసనీయం అని కితాబునిచ్చారు. కరోనా కట్టడిలో పోలీసులే ముందుండి పోరాడుతున్నారు. కరోనా వేళ మానవతా దృక్పథంతో సేవలందిస్తున్నారు. కరోనా కష్ట కాలంలో పోలీసుల మానవీయ కోణం ప్రజలకు తెలిసింది. ఈ కష్టకాలంలో పోలీసుల పాత్రను చరిత్రలో లిఖించారు. కరోనా కట్టడిలో పోలీసులు ముందుండి పోరాడుతున్నారని ప్రధాని మోదీ కొనియాడారు. కరోనా సంకట స్థితిలో పోలీసుల సేవలు ప్రశంసనీయమన్నారు. ఇండోర్‌లో చాలా మంది పోలీసులు కరోనా బారిన పడ్డారని, ఖాకీ దుస్తులను చూసి గర్వపడాలని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఐపీఎస్ ప్రొబేషనర్లను గతంలో ఇంటికి ఆహ్వానించే వాడిని. కొవిడ్ కారణంగా ముఖాముఖి కలుసుకోలేకపోతున్నా. త్వరలోనే మీతో సమావేశ మవుతానని మోదీ అన్నారు. పనిచేసే చోట ఉపాధ్యాయులు,నిపుణులతో నెలకోసారైనా భేటీ కావాలన్నారు. ఈ ఏడాది 131 మంది ఐపీఎస్ అధికారులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. 121 మంది 2018 బ్యాచ్‌కు చెందినవారు కాగా.. మరో 10 మంది 2017 బ్యాచ్‌కు చెందినవారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో 28 మంది మహిళా ప్రొబేషనర్లు ఉన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో 11 మందిని తెలంగాణకు, ఐదుగురిని ఏపీకి కేటాయించారు. పాసింగ్ ఔట్ పరేడ్‌కు తమిళనాడు కేడర్‌కు చెందిన కిరణ్ శృతి నాయకత్వం వహించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, సహాయక మంత్రి కిషన్‌రెడ్డి, జితేంద్రసింగ్, వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో జరిగిన ఐపిఎస్‌ల పాసింగ్ ఔట్ పరేడ్‌లో ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించిన ప్రధాని మోడీ

ఇక నుంచి ఎస్‌బిఐ ఖాతాదారులకు అలర్ట్ మెసేజ్

న్యూఢిల్లీ,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): ఖాతాదారుల భద్రత కోసం భారతీయ స్టేట్ బ్యాంక్ మరో ముందడుగు వేసింది. ఏటీఎమ్ మోసాలను అరికట్టేందుకు ఓ కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇకపై ఏటీఎమ్‌తో బ్యాలెన్స్ , మినీ స్టేట్‌మెంట్ ఎంక్వైరీ చేసిన ప్రతిసారి రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు ఓ మెసెజ్ పంపటం ద్వారా ఖాతాధారులను అలర్ట్ చేయనుంది. ఈ మెసేజ్ అలర్ట్ కారణంగా.. ఒకవేళ అనధికార లావాదేవీ జరుగుతున్నట్లయితే సదరు ఖాతాదారుడు వెంటనే స్పందించి తన ఏటీఎమ్ కార్డును బ్లాక్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ కొత్త ఫీచర్‌కు సంబంధించిన వివరాలను ఎస్‌బీఐ తన అధికారిక ట్విటర్ ఖాతాలో వెల్లడించింది. బ్యాలన్స్, మినీ స్టేట్‌మెంట్ ఎంక్వైరీలకు సంబంధించిన ఎస్ఎమ్ఎస్ అలర్ట్‌లను నిర్లక్ష్యం చేయవద్దని ఎస్‌బీఐ పేర్కొంది. అనధికారిక లావాదేవీ జరుగుతున్నట్లయితే వెంటనే ఏటీఎమ్‌ను బ్లాక్ చేయాలని తెలిపింది.

దేవికారాణి మరోమారు అరెస్ట్

ఇఎస్ఐ స్కామ్‌లో పోలీసుల కేసు

హైదరాబాద్,సెప్టెంబర్4 (ఆర్ ఎన్ఎ): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఈఎస్ఐ స్కామ్‌లో మాజీ డైరెక్టర్ దేవికారాణి మరోసారి అరెస్ట్ అయ్యారు. దేవికారాణితో పాటు మరో 8 మందిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ స్కాంలో ఇప్పటికే రూ. 6.5 కోట్ల అక్రమాలను ఏసీబీ గుర్తించింది. ఈఎస్ఐ మందుల కొనుగులు లో భారీ అక్రమాలను ఏసీబీ గుర్తించింది. మరో కేసు నమోదు చేసిన ఏసీబీ దర్యాప్తును ప్రారంభించింది. ఈ స్కామ్‌లో మరికొంత మందిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. కంచర్ల శ్రీ హరి బాబూ అలియాస్ బాబ్జీ, కంచర్ల సుజాత, కుక్కల కృప సాగర్ రెడ్డి, బండి వెంకటేశ్వర్లు, చెరుకూరి నాగరాజు, తింకశల వెంకటేష్‌లపై ఏసీబీ కేసు నమోదు చేసింది. నకిలీ ఇండెన్స్, ఎక్కువగా కోడ్ చేసి తప్పుడు లెక్కలతో అక్రమాలకు పాల్పడ్డారు. అక్రమ లావాదేవీలతో నిందితులు ప్రభుత్వ ఖజానాకు పెద్ద మొత్తంలో నష్టం చేకూర్చారు. నిందితులను ఏసీబీ అధికారులు సాయంత్రం మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు.

దేశంలో ఆగని కరోనా విజృంభణ

రెండోరోజూ 80 వేలకుపైగా పాజిటివ్ కేసులు

న్యూఢిల్లీ,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా మహమ్మారి పంజా విసురుతున్నది. దేశవ్యాప్తంగా భారీగా కరోనా కేసులు నమోదవుతున్నాయి. ఈనేపథ్యంలో వరుసగా రెండోరోజూ 80 వేలకుపైగా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో దేశంలో కరోనా కేసులు 39 లక్షలు దాటాయి.

దేశంలో గత 24 గంటల్లో కొత్తగా 83,341 మందికి కరోనా వైరస్ సోకింది. దీంతో మొత్తం కరోనా కేసుల సంఖ్య 39,36,748కు చేరింది. ఇందులో 8,31,124 కేసులు యాక్టివ్‌గా ఉండగా, మరో 30,37,152 మంది బాధితులు కరోనా నుంచి కోలుకుని డిశ్చార్జీ అయ్యారు. కరోనా బారినపడినవారిలో మరో 1096 మంది బాధితులు మరణించారు. ఇప్పటివరకు కరోనా మృతుల సంఖ్య 68,472కు చేరింది. దేశంలో కరోనాతో ఇంతపెద్ద సంఖ్యలో మరణించడం ఇదే మొదటిసారని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. దేశవ్యాప్తంగా నిన్న 11,69,765 మందికి కరోనా పరీక్షలు నిర్వహించామని భారతీయ వైద్య పరిశోధనా మండలి ప్రకటించింది. దీంతో సెప్టెంబర్ 3 వరకు మొత్తం 4,66,79 ,145 నమూనాలను పరీక్షించామని తెలిపింది.మొత్తంగా భారత్‌లో కరోనా ప్రభావం తగ్గుముఖం పట్టడం లేదు. తొలుత కరోనా ప్రభావం తీవ్రంగా ఉన్న స్పెయిన్, అమెరికా, బ్రెజిల్‌లో కరోనా ప్రభావం రానురాను తగ్గిపోగా భారత్‌లో మాత్రం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. భారత్‌లో గడచిన 24 గంటల్లో 83,341 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో.. భారత్‌లో మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 39 లక్షలు దాటింది.

తెలంగాణలో కొత్తగా 2,478 పాజిటివ్ కేసులు

తెలంగాణలో కరోనా వైరస్ విజృంభణ కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో 2,478 పాజిటివ్ కేసులు నమోదవడంతో మొత్తం కేసుల సంఖ్య 1,35,884కు చేరింది. వైరస్ బాధితుల్లో కొత్తగా 10 మంది మృతి చెందారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 866కు చేరింది. గురువారం ఒక్కరోజే 2,011 మంది కోవిడ్ రోగులు కోలుకుని ఆస్పత్రుల నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఇప్పటివరకు కోలుకున్నవారి మొత్తం సంఖ్య 1,02,024. రాష్ట్రంలో ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 32,994. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ శుక్రవారం విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌లో పేర్కొంది. ఇక దేశవ్యాప్తంగా కరోనా బాధితుల రికవరీ రేటు 77.14 శాతంగా ఉండగా.. రాష్ట్రంలో 75.0 శాతంగా ఉంది. భారత్‌లో మరణాల రేటు 1.74 శాతంగా ఉండగా.. తెలంగాణలో 0.63 శాతంగా ఉంది. గత 24 గంటల్లో తెలంగాణ వ్యాప్తంగా 62,543 పరీక్షలు నిర్వహించామని మొత్తం పరీక్షల 16,05,521కు చేరిందని వైద్యారోగ్య శాఖ వెల్లడించింది.

కరోనా కట్టడికి ప్రజల్లో చైతన్యం

ప్రజలకు ధైర్యం చెబుతున్న నేతలు

హైదరాబాద్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): కరోనా కట్టడికి ఎమ్మెల్యేలు రంగంలోకి దిగారు. పలు ప్రాంతాల్లో ప్రజాప్రతినిలు తమ ప్రాంతాల్లో ప్రజలకు ధైర్యం నూరిపోస్తున్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నిరంతరాయంగా నియోజకవర్గ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కొత్తపేట్ గ్రామం శివాజీనగర్‌లో ఇటీవల కరోనా పరీక్షలు చేయగా 40 మందికి పైగా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో శివాజీనగర్ ప్రజలు భయభ్రాంతులకు గురికాగా జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ప్రజలకు కరోనాపై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. కరోనాతో భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం కల్పించారు. గ్రామస్తులకు సర్పంచ్, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో 500 మాస్కులు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మన్నెగుండ్ల వెంకమ్మ, బత్తిని రాజేశం, ఎంపీటీసీ మందుల శ్రీనివాస్ , ఉప సర్పంచ్ రాజేష్, సింగిల్ విండో చైర్మన్ మల్లారెడ్డి, మహేశ్వర్ రావు, కోల శ్రీనివాస్, తలారి రాజేష్, నాయకులు లావుడ్యా సురేందర్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, గంగారెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు. ఇకపోతే యాదాద్రిభువనగిరి జిల్లాలోని అడ్డగూడూర్ మండలం డి.రేపాక గ్రామంలో కరోనా వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామంలో కరోనా విజృభిస్తున్న సందర్భంలో వీధుల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. అధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఎప్పటికప్పుడు హైడ్రోక్లోరైడ్ ద్రావణాన్ని గ్రామంలో పిచికారీ చేయించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రజలను కోరారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడారు. వైద్య సిబ్బందిని మరింత పెంచాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విధిగా మాస్కులను ధరించాలన్నారు.

పార్లమెంట్ మార్గదర్శకాల మేరకు అసెంబ్లీ సమావేశాలు

పార్లమెంట్ మార్గదర్శకాల మేరకు అసెంబ్లీ సమావేశాలు
ఎమ్మెల్యేలు, సిబ్బంది, మీడియా ప్రతినిధులకు కరోనా టెస్టులు
పాజిటివ్ ఉంటే సమావేశాలకు అనుమతి లేదు
మీడియా పాయింట్ రద్దు... గ్యాలరీకే మీడియా పరిమితం
అధికారులతో సమీక్షించిన స్పీకర్ పోచారం, గుత్తా

హైదరాబాద్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో కట్టుదిట్టమైన చర్యలతో అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఈ నెల 7నుంచి జరిగే సమావేశాలకు అత్యంతంత జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అసెంబ్లీకి వచ్చే ఎమ్మెల్యేలు, వారి సిబ్బంది, భద్రతా సిబ్బందికి కరోనా టెస్టులు చేసి లోనికి అనుమతిస్తారు. అలాగే మీడియా ప్రతినిధులకు కూడా టెస్టులు చేసి పాజిటివ్ లేకుంటేనే అనుమతి స్తారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, అధికారుల తో శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలు సమీక్షించారు. సభా వ్యవహారాలశాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డితో పాటు చీఫ్ విప్‌లు పాల్గొన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి దృష్ట్యా శాసనసభలో కొత్తగా 40 సీట్లు, మండలిలో కొత్తగా 8 సీట్లను ఏర్పాటు చేశామని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశం ముగిసిన అనంతరం వేముల ప్రశాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలకు ప్రభుత్వం అన్ని విధాలా సన్నద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కొవిడ్ నేపథ్యంలో ప్రభుత్వం తరపున అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. పార్లమెంట్ ఇచ్చిన మార్గదర్శకాలు పాటిస్తూ అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. శాసనసభ, మండలి హాల్‌లో ఆరు అడుగుల దూరం ఉండేలా సీట్ల ఏర్పాటు చేశామని చెప్పారు. మార్షల్స్ రెండు రోజుల ముందే కరోనా పరీక్షలు చేయించుకోవాలని ఆదేశించామని అన్నారు. అసెంబ్లీకి వచ్చే అధికారులు, ఇతర సిబ్బందికి కరోనా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అసెంబ్లీ సెక్రటరీ ఆధ్వర్యంలో మీడియా సిబ్బందికి కొవిడ్ టెస్టులు నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. శాఖలవారీగా అవసరం ఉన్న అధికారులు మాత్రమే వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. శాసనసభ, మండలిలో రెండు చొప్పున అంబులెన్సులతో పాటు పీపీఈ కిట్లు, ర్యాపిడ్ కిట్లు, ఆక్సీ మీటర్లు అందుబాటులో ఉంచుతామని అన్నారు. జీహెచ్ఎంసీ సిబ్బందితో ప్రతిరోజూ అసెంబ్లీతో పాటు ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను కూడా శానిటైజ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభం కాబోయే అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, అధికారులతో శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సభా వ్యవహారాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డితో పాటు చీఫ్ విప్‌లు సమావేశమయ్యారు. జీఏడీ, ఆర్థిక, వైద్య, ఆరోగ్య, పురపాలక, జీహెచ్ఎంసీ అధికారులు హాజరయ్యారు. కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఇకపోతే కరోనా కారణంగా మీడియా పాయింట్‌ను ఎత్తేయాలని నిర్ణయించారు. అలాగే మంత్రుల ఛాంబర్‌లోకి మీడియాకు అనుమతి నిరాకరించారు. కేవలం గ్యాలరీకి మాత్రమే వారిని పరిమితం చేశారు.

యథాతథంగా నీట్, జేఈఈ పరీక్షలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలైన నీట్, జేఈఈ పరీక్షలు వాయిదా వేయాలన్న రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. పరీక్షలను యథావిధిగానే నిర్వహించాలని సూచించింది. నీట్, జేఈఈ పరీక్షలు వాయిదా వేయాలని సుప్రీంకోర్టులో 6 రాష్ట్రాలు రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేశాయి. ఆరు బీజేపీయేతర పాలిత రాష్ట్రాలు దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఈ క్రమంలో నీట్, జేఈఈ పరీక్షలు యథాతథంగా కొనసాగనున్నాయి. ఆగస్టు 17న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని రివ్యూ పిటిషన్‌లో పేర్కొన్నారు. కొవిడ్ వ్యాప్తి దృష్ట్యా నీట్, జేఈఈ పరీక్షలు వాయిదా వేయాలని కోర్టును కోరారు. కానీ ఈ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. దేశ వ్యాప్తంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమైన విషయం విదితమే. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, మహారాష్ట్రకు చెందిన మంత్రులు సంయుక్తంగా ఆగస్టు 28న సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఒకవైపు కరోనా మహమ్మారి, మరోవైపు భారీ వర్షాలు, వరదల వల్ల తమ తమ రాష్ట్రాల్లో పరీక్షలు నిర్వహించలేని పరిస్థితులు నెలకొన్నాయిని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జేఈఈ, నీట్ పరీక్షలను వాయిదా వేయాలని ఆరు రాష్ట్రాల ముంత్రులు సుప్రీంకోర్టును అభ్యర్థించారు. కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో నీట్, జేఈఈ ప్రవేశ పరీక్షలను రద్దు చేయాలని 11 రాష్ట్రాలకు చెందిన 11 మంది విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను ఆగస్టు 17న సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ తీర్పును పునఃసమీక్షించాలని ఆరు బీజేపీయేతర పాలిత రాష్ట్రాలు కోర్టులో రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేశాయి. ఆ పిటిషన్‌ను కూడా కోర్టు శుక్రవారం కొట్టేసింది.

కరోనా పేషెంట్ ఆత్మహత్య

ఖమ్మం,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా పేషెంట్ ఆత్మహత్యకు పాల్పడింది. నేలకొండపల్లి మండలం, బుద్ధారం గ్రామానికి చెందిన మరియమ్మ కరోనా రావడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. అయితే గ్రామంలో తనకు కరోనా సోకిందని తెలిస్తే అవమానిస్తారని భావించింది. ఆందోళనకు గురైంది. కరోనాతో మరియమ్మ శ్వాస సంబంధిత సమస్య కూడా ఎదుర్కొంది. అయితే ఆస్పత్రిలో ఎవరూ పట్టించుకోవడంలేదని మనస్తాపానికి గురైంది. అటు ఊరిలోవారు ఏమంటారోనని ఆందోళన.. ఇటు ఆస్పత్రిలో పట్టించుకోవడంలేదనే బాధతో ఆత్మహత్య చేసుకుంది. ఆస్పత్రిలోని బాత్‌రూమ్‌లోనే ప్రాణం తీసుకుంది.

మళ్లీ ఆస్పత్రిలో చేరిన కాంగ్రెస్ నేత శివకుమార్

బెంగళూరు,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ శుక్రవారం మళ్లీ ఆసుపత్రిలో చేరారు. తనకు జ్వరంగా ఉండటంతో బెంగళూరు జయానగర్‌లోని ప్రైవేట్ దవాఖానలో చేరినట్లు ఆయన తెలిపారు. డీకే శివకుమార్ గత నెలలో కరోనాబారిన పడ్డారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయనకు నెగిటివ్ రిపోర్టు రావడంతో ఇటీవల డిశ్చార్జ్ చేశారు. అయితే తనకు మళ్లీ జ్వరం రావడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చేరినట్లు డీకే శివకుమార్ తెలిపారు. కర్ణాటక సీఎం యెడియూరప్ప, మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య, ఆయన కుమారుడు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కరోనాబారినపడ్డారు. వీరిలో కొందరు కోలుకున్నారు. కర్ణాటకలో కరోనా కేసుల సంఖ్య 3.61 లక్షలకు చేరగా 6 వేల మందికిపైగా మరణించారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

హైదరాబాద్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): నగరంలో చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. నలుగురు సభ్యుల ముఠా నుంచి 51 తులాల బంగారం, కిలోన్నర వెండి, కారుతో పాటు ఓ బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ. 31.75 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. దొంగల ముఠాపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దొంగలను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించనున్నారు.

ఇంద్ర నేవీ-2020 విన్యాసాలు ప్రారంభం

ఢిల్లీ, సెప్టెంబర్ 4: భారత్-రష్యా సంయుక్త 11వ విడత 'ఇంద్ర నేవీ' విన్యాసాలు బంగాళాఖాతంలో ప్రారంభమయ్యాయి. ఈరోజు ,రేపు రెండు రోజుల పాటు ఈ విన్యాసాలు జరగనున్నాయి. 2003లో తొలిసారి విన్యాసాలు జరిగాయి. రెండు దేశాల మధ్య దీర్ఘకాలిక వ్యూహాత్మక సంబంధానికి గుర్తుగా ఈ విన్యాసాలు నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో, రష్యా ఆహ్వానం మేరకు భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాస్కోలో పర్యటిస్తున్నారు. ద్వైపాక్షిక సహకారంపై చర్చలు జరుపుతు న్నారు. రెండో ప్రపంచ యుద్ధం విజయం 75వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలోనూ రాజ్‌నాథ్ సింగ్ పాల్గొంటారు. ఏటికేడూ ఇంద్ర విన్యాసాల స్థాయిని పెంచు తున్నారు. రెండు నౌకాదళాలు ఏండ్ల తరబడి నిర్మించిన అంతః కార్యాచరణను మరింత బలోపేతం చేయడం, బహుముఖ సముద్ర కార్యాచరణపై అవగహన, విధానాలను మెరుగుపరచడం ఇంద్ర నేవీ-20 ప్రాథమిక లక్ష్యం. కొవిడ్ కారణంగా, "భౌతిక సంబంధం లేకుండా, సముద్రంలో మాత్రమే" ఈసారి విన్యాసాలు నిర్వహిస్తున్నారు.

షెడ్యూల్ ప్రకారమే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు

అలాగే దేశంలో 65 స్థానాలకు ఉప ఎన్నికలు
ఒకేసారి ఎన్నికల నిర్వహణకు ఇసి ప్రకటన

న్యూఢిల్లీ,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు పెండింగ్‌లో ఉన్న 65 స్థానాలకు ఉప ఎన్నికలు ఒకేసారి నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం శుక్రవారం తెలిపింది. షెడ్యూల్ ప్రాకరం బీహార్ అసెంబ్లీ ఎన్నికలునిర్వహించేందుకు ఇసి సన్నద్ధం అవుతోంది. వివిధ రాష్ట్రాల శాసనసభలలో 64 స్థానాలకు అదేవిధంగా ఒక లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇందులో తెలంగాణలోని దుబ్బాక ఉప ఎన్నిక కూడా ఉంది. కేంద్ర బలగాల మోహరింపు ఇతర కారణాలతో రెండింటిని ఒకేసారి నిర్వహిస్తున్నట్లు ఈసీ పేర్కొంది. ప్రస్తుత బిహార్ అసెంబ్లీ నవంబర్ 29వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో బీహార్ అసెంబ్లీకి అక్టోబర్-నవంబర్‌లో ఈసీ ఎన్నికలను నిర్వహించేందుకు సమాయత్తం అవుతోంది. ఈ నేపథ్యంలో బీహార్ సాధారణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ అదేవిధంగా వివిధ రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ఒకేసారి విడుదల చేయనున్నట్లు ఈసీ తెలిపింది. కోవిడ్-19, అధిక వర్షాల కారణంగా ఆయా రాష్ట్రాల్లో జరగాల్సిన ఉపఎన్నికలు ఇటీవల వాయిదా పడ్డాయి. దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగనున్న విషయం తెలిసిందే. అధికార టీఆర్ఎస్ పార్టీ, దుబ్బాక నియోజకవర్గ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. ఉమ్మడి మెదక్ జిల్లా టీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పార్టీ అభ్యర్థి విజయానికి ప్రయత్నాలు ప్రారంభించారు. పార్టీ అభ్యర్థి గెలుపు మాత్రమే కాకుండా ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు డిపాజిట్ గల్లంతు అయ్యేలా హరీశ్‌రావు క్షేత్రస్థాయిలో తిరుగుతూ అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్నారు. అనేక కార్యక్రమాలు చేపట్టారు.

చరిత్రలో నేటినిజం

కం॥ స్థూల్తిగ "వేణువు" నూదుచు
మూల్గిభూ ఆమ గనున్న మోదపల్లనగన్
తాల్తిక మాస శశిగా
కొల్తింపంబడుచు నుండు "కేశవగిండే" !!

(సెప్టెంబర్5 "వేణువు" కేశవగిండే జననం..)

-రాధశ్రీ
సెల్: 9494481210

కరోనా భయాలు అప్పుడే తొలగిపోలేదు

నేటినిజం
శనివారం 5-9-2020

ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ గత ఆరునెలలుగా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అన్‌లాక్ మొదలవడం, అధికారులు చేతులెత్తేయడంతోపాటు జనం రోడ్లపై ఇష్టానుసారంగా తిరుగుతుండటంతో గ్రేటర్ హైదరాబాద్‌లో కేసులు రోజురోజుకి పెరుగుతూనే ఉన్నాయి. దీనికితోడు ఇప్పుడిప్పుడే మళ్లీ వ్యాపారాలు పుంజుకోవడంతో ప్రజలు ఉపాధి కోసం రోడ్డెక్కుతున్నారు. గ్రామాల నుంచి మెల్లగా ప్రజలు మళ్లీ పనుల కోసం పట్టణాల వైపు మళ్లుతున్నారు. ప్రస్తుతం వైరస్ వేగంగా విస్తరిస్తోంది. నగరాలకు ఇది పరిమితమైనప్పుడే అదుపులోకి తెచ్చి ఉంటే బాగుండేది. ప్రస్తుతం కోవిడ్ వైరస్ ప్రపంచ పర్యటన చేస్తోంది. కొన్ని దేశాల్లో ప్రభావం తగ్గినా కొన్నిచోట్ల మరింత విజృంభిస్తోంది. ఇలా అది ప్రవర్తిస్తున్న తీరు ఇంకా కొన్ని ప్రదేశాలు తిరిగేలోగా మరింత మార్చుకుంటుందా? ఇప్పుడు ఐరోపాలో తగ్గినా మళ్లీ పశ్చిమ దేశాల్లో చలికాలం వచ్చేటప్పటికీ కేసులు పెరిగి పెనుమార్పులొస్తాయా అన్నది తెలుసుకునేందుకు డిసెంబర్, జనవరి వరకు వేచి చూడాలని నిపుణులు అంటున్నారు. మళ్లీ ఏప్రిల్ వచ్చేటప్పటికీ పరిస్థితులు ఎలా ఉంటాయనేది బేరీజు వేయాల్సి ఉంది. ప్రస్తుతం వైరస్ సోకినా లక్షణాలు బయటపడని అసింప్టమేటిక్ వ్యక్తులు, ప్రీ సిమ్టమ్స్ ఉన్న వ్యక్తుల నుంచి జాగ్రత్తగా ఉండాలి. మాస్క్‌లు, మనుషుల మధ్య దూరం పాటించడంతో పాటు గుంపుల్లోకి వెళ్లొద్దు. షాపింగ్ మాల్స్‌తో పాటు గాలి, వెలుతురు సరిగా లేని షాపు ల్లోనూ అరగంట ఉన్నా ప్రమాదమే. విశాల మైన ప్రదేశాలు, గాలి, వెలుతురు ఎక్కువగా ప్రసరించే చోట్లలోనే ఉండాలని అంటున్నారు. లాక్‌డౌన్ ఎక్కువ కాలమే ఉన్నా ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో అంచెలంచెలుగా ఆంక్షలు ఎత్తేయడంతో ప్రమాదం తగ్గిపోయిం దనే భావన ప్రజల్లో ఏర్పడింది. అన్ని ప్రాంతాలకు రాకపోకలు పెరగటంతో దీని విస్తరణ మారుమూల ప్రాంతాలకు సైతం చేరుకుంది. చికిత్స తీరుతెన్నులపై.. గతంతో పోల్చితే ఇప్పుడు మెరుగైన చికిత్సా పద్ధతులు, రకరకాల మందులు, ఇంజెక్షన్లు, స్టెరాయిడ్స్ అందుబాటు లోకి వచ్చాయి. వైరస్ సోకాక చాలా తక్కువ మంది మాత్రమే ప్రమాదకర దశకు వెళ్తున్నారు. ఎలాంటి లక్షణాలకు ఏ మందులు వాడాలి, మార్పులు చోటుచేసుకున్న వారిని ఎలా పరీక్షించాలి, తీవ్రత పెరిగిన వారిని ఎలా ట్రీట్ చేయాలన్న దానిపై గత రెండు నెలల్లో ఆప్షన్లు పెరిగాయి. తీవ్రమైన జబ్బు చేసినా చికిత్స చేసే సదుపాయాలు వచ్చాయి. ప్రభుత్వాలు చెబుతున్న దానికి వాస్తవానికి లెక్కల్లో తేడా కనిపి స్తోంది. వాస్తవానికి అంతకు మించే కేసులున్నా బులిటెన్‌లో తక్కువ చేసి చూపిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారుల లెక్కలు పలుమార్లు ఇదే విషయం స్పష్టం చేశాయి. ప్రభుత్వం విడుదల చేస్తున్న బులిటెన్ లెక్కలు ఉండడం లేదన్నది ఏర్పాటుచేసిన టెస్టింగ్ సెంటర్లలో రద్దీ ఎక్కువ ఉండడం, వివిధ కారణాలతో టెస్టులు చేయక పోవడంతో చాలామంది ప్రైవేట్‌లో టెస్టులు చేయించుకుంటున్నారు. మరికొందరు ల్యాబ్ టెక్నీషియ న్లను ఇంటికే పిలిపించుకుని శాంపిల్స్ ఇస్తున్నారు. ఆ లెక్కలేవీ పూర్తి స్థాయిలో ఇందులో చేరడం లేదు. హోం క్వారంటైన్ అయ్యేందుకు ఇంట్లో వసతి లేని వాళ్ల కోసం ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటుచేయాలని హైకోర్టు ఆదేశించినా, కొన్ని మాత్రమే ఏర్పాటుచేశారు. దాంతో పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు కరోనా విషయంలో వచ్చే ఏప్రిల్ దాకా జాగ్రత్తలు తప్పనిసరి. వైరస్ ప్రవర్తన ఎలా ఉంటుంది. మనం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, చికిత్సా పద్ధతులు, వాటి ఫలితాలపై అప్పటికి పూర్తి స్పష్టత వస్తుంది. కరోనా వైరస్ ఎక్కువ మందికి సోకి విస్తృతంగా వ్యాప్తి చెందాక తాను బలహీనమై మనుగడే కోల్పోయే పరిస్థితులు ఏర్పడతాయి కాబట్టి తన సహజ గుణాన్ని, దిశను కూడా మార్చుకుంటుందా అన్నది వేచి చూడాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే ఏప్రిల్‌లోగా వ్యాక్సిన్ వస్తే ఇంకా మంచిదే అని వెల్లడించారు. వైరస్ వల్ల ఇన్‌ఫెక్షన్ల స్థాయి తగ్గి మరణాలసంఖ్య పెరిగిన క్రమంలో స్వతహాగా దాని మనుగడే ప్రమాదంలో రూఢీ అయ్యింది. లెక్కకు మిక్కిలి కేసులు వస్తున్నా, లెక్క తక్కువ చేసి చూపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లావైద్యాధికా రులు, సర్కారు బులిటెన్ లెక్కలకు తేడాలు కూడా చాలాసార్లు బయటప డ్డాయి. ప్రభుత్వ ఆసుపత్రులు , ప్రైమరీ హెల్త్ సెంటర్లలో వెంటిలేటర్ల ఆవశ్యకత అత్యధికంగా ఉంటుందని భావించినా ఇప్పుడు ఆ అవసరం లేకుండానే చికిత్స అందించగలుగుతున్నారు. ఆక్సిజన్ అందించడం, పొట్టమీద బోర్లా పడుకోబెట్టడం, వివిధ స్టెరాయిడ్స్, ఇతర మందుల వినియోగంతో జబ్బు తీవ్రం కాకుండా డాక్టర్లు నివారించగలుగు తున్నారు. వైరస్ సోకుతున్న వారు అధికసంఖ్యలోనే ఉంటున్నా కోలుకుంటున్న వారు కూడా పెద్దసంఖ్య లోనే ఉంటున్నారు. దీంతో మరణాల సంఖ్య కూడా తక్కువగా ఉంటోంది. అంటే ప్రజల్లో వ్యాప్తి కారణంగా వైరస్ తీవ్రత కూడా తగ్గు తోందని గుర్తించారు. ఇది సోకిన వారిలో యాంటీబాడీస్ డెవలప్ అవుతున్నాయి. అయితే కోవిడ్ రాకుండా మందులతో నివారించడం సాధ్యంకాదు. రాకుండా జాగ్రత్తలు మాత్రమే అవసరం అవుతున్నాయని చెప్పాలి. కూరగాయలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్, నట్స్ ఇతర పోషక విలువలున్న ఆహారంతో రోగనిరోధక శక్తి పెంచు కోవడం అలవాటు చేసుకున్నారు. చాలావరకు ముందస్తు జాగ్రత్తల వల్ల వైరస్ సోకకుండా చూడొచ్చని రుజువయ్యింది. అయితే వ్యాక్సిన్ వస్తేనే కరోనాను పూర్తిగా నిరోధించడం సాధ్యం అవుతుంది. వ్యాక్సిన్ వచ్చాక దానిఫలితాలను బట్ట తదుపరి చర్యలకు పూనుకోవాల్సి ఉంటుంది. అంతదాకా అప్రమత్తతే మంచిదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

దశలవారీగా మెట్రో రైల్ సర్వీసులు

-7నుంచి ప్రారంభించేందుకు సర్వం సిద్ధం

హైదరాబాద్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లో ఏడో తేదీ నుంచి మెట్రో రైల్ సేవలు తిరిగి ప్రారంభం కానున్నాయి. కాగా ప్రయాణికుల సంఖ్యను బట్టి రైలు ట్రిప్పుల ఫ్రీక్వెన్సీపై నిర్ణయం తీసుకోనున్నారు. మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్వీఎస్ రెడ్డి ఈ వివరాలను వెల్లడించారు. మెట్రో స్టేషన్లతో పాటు రైళ్లలో కూడా భౌతిక దూరం పాటించాల్సిన క్రమంలో ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. కరోనా నేపథ్యంలో... ప్రయాణికులు తప్పనిసరిగా భౌతిక దూరాన్ని పాటించాల్సిన క్రమంలో... సీసీ టీవీల ద్వారా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఇక ప్రయాణికులు మాస్కులు ధరించనిపక్షంలో... జరిమానాలను విధించనున్నారు. మరోవైపు... మెట్రో రైల్ ఉద్యోగులకు పీపీఈ కిట్లను అందించనున్నారు. టిక్కెట్లను... స్మార్ట్ కార్డు, క్యాష్‌లెస్ విధానాల్లో విక్రయిస్తారు. ఇక... కట్టడి ప్రాంతాల్లోని గాంధీ ఆసుపత్రి, భరత్‌నగర్, మూసాపేట్, యూసుఫ్‌గూడా, ముషీరాబాద్ స్టేషన్లలో సర్వీసులు నడబవబోవు. . మొత్తం మూడు దశల్లో మెట్రో రైలు సర్వీసులు పునఃప్రారంభం కానున్నాయి. తొలిదశలో మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వరకు ఎనిమిదో తేదీ నుంచి, నాగోల్-రాయదుర్గం మెట్రో సర్వీసులు, ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు సర్వీసులు నడుస్తాయి.

కాంగ్రెస్‌కు లొంగిపోయిన ఫేస్‌బుక్ యాజమాన్యం

హైదరాబాద్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ ఒత్తిడికి ఫేస్‌బుక్ యాజమాన్యం లొగింపోయిందని బీజేపీ ఎమ్మెల్యే రాజసింగ్ అన్నారు. తన భుజంపై గన్ పెట్టిన కాంగ్రెస్.. బీజేపీని టార్గెట్ చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రోద్బలంతోనే తన ఫేస్‌బుక్ అకౌంట్‌ను ఫేస్‌బుక్ యాజమాన్యం రద్దు చేసిందన్నారు. దేశ ద్రోహులు, రోహింగ్యా ముస్లింలపై తన తీరు మారదని స్పష్టం చేశారు. ఫేస్‌బుక్ కాకపోతే.. మరొక వేదికపై తన అభిప్రాయాలను తెలియజేస్తానని పేర్కొన్నారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తోన్న అసదుద్దీన్, అక్బరుద్దీన్ ఓవైసీల అకౌంట్స్‌ను కూడా క్లోజ్ చేయాలని డిమాండ్ చేశారు. తన ఫేస్‌బుక్ అకౌంట్‌ను పునరుద్ధరించాలని కేంద్ర ఐటీ శాఖ మంత్రికి లేఖ రాస్తానని చెప్పారు. తన పేరుతో ఉన్న అనధికారిక ఫేజ్‌బుక్ పేజీలు తొలగించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ విధించాలి: భట్టి

జనగామ,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా వ్యాప్తికి ప్రభుత్వమే కారణమని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. రాష్ట్రంలో వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని, వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని భట్టి డిమాండ్ చేశారు. మంత్రి ఈటల రాజేందర్ ఉత్సవ విగ్రహంలా మారిపోయారని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో ఒక్క ఆస్పత్రిని కూడా నిర్మించలేదని, అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ తీరును ఎండగడతామని భట్టి విక్రమార్క ప్రకటించారు. చర్చకు ప్రభుత్వం ముందుకు రావాలని అన్నారు.

అసమర్థ సిఎం కెసిఆర్: బండి

భద్రాద్రికొత్తగూడెం,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): చేతకాని అసమర్థ సీఎం కేసీఆర్ అంటూ బీజేపీ నేత బండి సంజయ్ నిప్పులు చెరిగారు. కరోనా బాధితుల్ని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమయిందని ఆరోపించారు. భాగ్యనగరాన్ని కోవిడ్ సిటీగా మార్చిన ఘనత టీఆర్ఎస్‌దేనని చెప్పారు. కోవిడ్

నియంత్రణకు కేంద్రం తెలంగాణకు రూ.7 వేల కోట్లు ఇచ్చిందని, కేంద్రం సూచనలను తెలంగాణ సర్కార్ పట్టించుకోవడం లేదని తప్పుబట్టారు. కోవిడ్ కారణంగా ఇప్పటి వరకు 10 మంది కార్యకర్తల్ని కోల్పోయామని సంజయ్ తెలిపారు.

బస్సు సర్వీసులపై జగన్‌తో మంత్రుల చర్చ

-న్యాయసలహాతో ముందుకు వెళ్లాలన్న సిఎం

విజయవాడ,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): ఏపీ- తెలంగాణ మధ్య ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభం కాని విషయంపై ముఖ్యమంత్రి జగన్ స్పందించారు. అవసరమైతే న్యాయ సలహా తీసుకుని ముందుకు వెళ్లాలని జగన్ సూచించారు. అన్‌లాక్ 4 ప్రారంభమైనా ఏపీ-తెలంగాణ మధ్య బస్సులు ప్రారంభం కాలేదని.. తెలంగాణకు బస్సులు నడిపే అంశం ఏం చేయాలని మంత్రులు పేర్ని నాని, బొత్స సత్యనారాయణ ఇవాళ సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సూచనలు చేసినట్లు సమాచారం. హైదరాబాద్ తోపాటు.. తెలంగాణలోని ఇతర ముఖ్య ప్రాంతాలన్నింటికీ బస్సులు నడవక పోవడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని సామాన్య ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. అసలే రైళ్లు లేక ఇబ్బంది పడుతున్న తరుణంలో కనీసం బస్సులైనా లేకపోవడం పేదలను.. సామాన్యులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరిపినా.. కొలిక్కి రావడం లేదు. దీంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఉందని మంత్రులు వివరించినట్లు తెలుస్తోంది. దీనిపై వెంటనే స్పందించి సీఎం జగన్ హైదరాబాద్‌తో పాటు అన్ని ప్రాంతాలకు వెంటనే ఆర్టీసీ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని.. ఈ విషయంలో అవసరమైతే న్యాయసలహా తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం.

కృష్ణానదిలో ముగ్గురి మునక

ఇద్దరిని కాపాడిన స్థానికులు

గల్లంతయిన మహిళ కోసం గాలింపు

జోగులాంబ గద్వాల,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): కృష్ణా నదిలో ముగ్గురు గల్లంతయ్యారు. వెంటనే గుర్తించిన స్థానికులు ఇద్దరిని కాపాడగా.. మరో మహిళ కనిపించకుండా పోయింది. జోగులాంబ గద్వాల జిల్లా.. అగ్రహారం వద్ద కృష్ణానదిలో జరిగిందీ ఘటన. కృష్ణా నది పరివాహక ప్రాంతాల ప్రజలు తమ నిత్యావసరాల కోసం పుట్టిలో రాకపోకలు సాగిస్తుంటారు.ఇదే క్రమంలో అగ్రహారం గ్రామం వద్ద ముగ్గురు ప్రమాదవశాత్తు నదిలో పడిపోవడం స్థానికంగా ఉన్న వారు చూసి కేకలు వేయడంతో.. పుట్టి నడిపేవారు గుర్తించి ఇద్దరిని కాపాడారు. మరో మహిళను కాపాడేందుకు ప్రయత్నిస్తుండగా.. ఆమె కనిపించకుండా సోయింది. స్థానికులు మరికొందరు గజ ఈతగాళ్లు ఒడ్డున ఉన్న పుట్టి తీసుకుని మహిళ కోసం గాలింపు చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. గల్లంతైన మహిళ ఆచూకీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

సమాజ నిర్మాత ఉపాధ్యాయుడే...!

(05 సెప్టెంబర్ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా)

పలక మీద తొలి అక్షరం దిద్దించటంతో మె?దలు అత్యుత్తమ స్థాయికి ఎదిగే దాకా మన వెంట నడిచి, తడబడినపుడు చేయూతనిచ్చి, నిరాశ చెందినపుడు ఆశల విత్తులు నాటి, ఎదుగుదలకు తనో నిచ్చనై, గుర్తింపు పొందినపుడు పరమానందసాగరంలో మునక వేసే 'నడిచే ఆదర్శాల నిధి' ఉపాధ్యాయుడు. గురువు లేని మనిషి ఉండడు. తరగతి గదిలో బోధించే వారే గురువులు కాదు. నిరక్షరాస్యుడు కూడా తను నమ్మిన వారిని గురువుగా స్వీకరిస్తాడు. పాఠ్యాంశాలతో శాస్త్రాలను బోధిస్తూ, వెన్ను తట్టి నడకను మరియు నడతను నేర్పగల నిస్వార్థజీవి గురువే. జీతం కాదు జీవితం ముఖ్యమని జ్ఞానోదయం కలిగించే నేర్పరి. ఢిల్లీకి రాజైన గురువు ముందు మాత్రం మోకరిల్లేది శిష్యుడే. గురువును నమ్మిన వారు ఎన్నటికీ చెడిపోరు. గురుశిష్య సంబంధం భగవంతుడికి భక్తుడికి ఉన్న అనుబంధం లాంటిది. దేశవ్యాప్తంగా గురువులను పూజించడానికి, కృతజ్ఞతలు సమర్పించడానికి, దీవెనలు తీసుకోవడానికి ఉద్దేశించబడిన రోజుగా 1962 నుండి ప్రతియేటా మన మాజీ రాష్ట్రపతి డా: సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజు 05 సెప్టెంబర్‌న "జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం" ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది.

డా: సర్వేపల్లి రాధాకృష్ణన్ 05 సెప్టెంబర్ 1888 రోజున చిత్తూరు జిల్లా (నేటి తమిళనాడు) తిరుత్తనిలో తెలుగు నియోగి బ్రాహ్మణ కుటుంబంలో సర్వేపల్లి వీరస్వామి సీతమ్మలకు జన్మించారు. నెల్లూరు జిల్లా సర్వేపల్లి గ్రామానికి చెందిన రాధాకృష్ణన్ చిన్నతనం తిరుత్తని మరియు తిరుపతిల్లో గడిచింది. పాఠశాల విద్యను తిరుత్తని, తిరుపతి మరియు వాలాజిపేట్‌లలో పూర్తి చేశారు. తన 16వ ఏటనే శివకమునిని వివాహమాడి ఐదుగురు కూతుర్లు మరియు ఒక కుమారుడికి (సర్వేపల్లి గోపాలన్) జన్మనిచ్చారు. మద్రాస్ క్రిస్టియన్ కళాశాలలో డిగ్రీ మరియు పిజీ (యంఏ తత్వశాస్త్రం) పూర్తి చేశారు. పిజీలో సమర్పించిన డిసర్టేషన్‌ను చదివిన గురువులు విలియమ్ మెస్టోన్ మరియుల్రైడ్ జార్జ్ హాగ్‌లు రాధాకృష్ణన్‌లోని ప్రతిభను చూసి అబ్బురపడ్డారు. మద్రాస్ ప్రసిడెన్సీ కళాశాల, మద్రాస్ మరియు కలకత్తా విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులు ఎనలేని ఖ్యాతిని అర్జించారు. హార్వర్డ్ మరియు ఆక్సఫర్డ్ విశ్వవిద్యాలయాలు లాంటి అనేక అంతర్జాతీయ వేదికల్లో భారతీయ తత్వాన్ని వినిపించి మన్ననలు పొందారు. ఆంధ్ర (1931-36) మరియు బెనారస్ (1939-48) విశ్వవిద్యాలయాలకు ఉపకులపతిగా సేవలందించారు. ఇండియన్ ఫిలాసఫీ మరియు హిందూతత్వానికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రపంచానికి పరిచయం చేసి, దేశ పరువు ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేశారు. ఆలస్యంగా రాజకీయ రంగప్రవేశం చేసిన రాధాకృష్ణన్ యునెస్కో భారత ప్రతినిధిగా(1946-52) మరియు రష్యా అంబాసిడర్‌గా (1949-52) పని చేశారు. భారత రాజ్యాంగ సభకు ఎన్నికైన డా: రాధాకృష్ణన్ భరతజాతి గర్వించదగిన ప్రఖ్యాత మాజీ ఉపరాష్ట్రపతి (1952-62) మరియు మాజీ రాష్ట్రపతి (1962-67)గా దేశానికి ఎనలేని సేవలను అందించారు. కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని రాధాకృష్ణన్ స్వాతంత్ర్య పోరాటంలో కూడా చురుకుగ పాల్గొనక పోయినా భారతీయ సంస్కృతీ వారసత్వ సంపదను విశ్వవ్యాప్తం చేయటంలో కృతకృత్యులైనారు. రాష్ట్రపతి పదవిలో ఉన్నపుడు రాధాకృష్ణన్ శిష్యబృందం సన్మానించే ప్రయత్నం చేయగా, తన పుట్టిన రోజు 05 సెప్టెంబర్ ఉపాధ్యాయ దినంగా పాటించమని సూచించారు. దీనికి స్పందనగా భారత ప్రభుత్వం 05 సెప్టెంబర్‌ను జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా 1962 నుండి పాటించుట జరుగుతోంది.

బ్రిటన్‌చే 'నైట్ బ్యాచిలర్'గా నియమించబడిన రాధాకృష్ణన్‌కు గౌరవ బిరుదు 'సర్' ప్రదానం చేయబడింది. 1933 - 37ల మధ్య ఐదుసార్లు నోబెల్ సాహిత్య బహుమతికి మరియు 11 సార్లు నోబెల్ శాంతి బహుమతికి వారి పేరును

ప్రతిపాదించారు. 1954లో దేశ అత్యుత్తమ పౌర పురస్కారం 'భారతరత్న'తో పాటు బ్రిటీష్ ఆర్డర్ ఆఫ్ మెరిట్, ఆక్సఫర్డ్ టెంప్లెటాన్ బహుమతి, జర్మన్ శాంతి బహుమతి లాంటి అనేక అంతర్జాతీయ గౌరవాలు స్వంతం చేసుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ పలు భారతీయ తత్వశాస్త్ర గ్రంథాలను (ఇండియన్ ఫిలాసఫీ-1 ఉ2, ఫిలాసఫీ ఆఫ్ రవింద్రనాథ్ టాగోర్, భగవద్గీత తత్వబోధన, రిలిజియన్ అండ్ సొసైటీ, ది ప్రిన్సిపల్ ఉపనిషద్, ది దర్మపాద, రికవరీ ఆఫ్ ఫేయిత్, ది బ్రహ్మసూత్ర, రిలిజియన్ - సైన్స్ ఉ కల్చర్ లాంటివి)రచించారు. మనందరికీ ప్రేరణగా నిలిచిన రాధాకృష్ణన్ జీవిత చరిత్ర ఆధారంగా మేధావులు పలు గ్రంథాలను కూడా రచించారు. ప్రపంచ స్థాయి అత్యుత్తమ ఉపాధ్యాయులు డా: రాధాకృష్ణన్ నుండి అనేక అంశాలను నేర్చుకున్నానని జవహర్ లాల్ నెహ్రూ స్వయంగా ఒప్పుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు, స్కాలర్, సాహితీవేత్త, రచయిత, తత్వవేత్త, విద్యావేత్త, స్టేట్స్ మెన్, మేధావి, రాజనీతిజ్ఞుడైన రాధాకృష్ణన్ జీవితమే మనందరికీ ఒక అమూల్య సందేశంగా నిలుస్తుంది. విద్యను బోధించటంతో వాటి విద్యాదాహాన్ని పెంచగలిగే వారే అసలైన గురువులుగా గౌరవింపబడతారు. తరగతి గదికి మాత్రమే పరిమితమై పాఠ్యాంశాలు బోధించేవారు సాధారణ గురువులు, పాఠ్యాంశాలను చక్కగా వివరించగల వారు మంచి గురువులు మరియు జీవిత పాఠాలతో పాటు విద్య పట్ల ప్రేరణ కలిగించగల వారు మాత్రమే అత్తమ ఉపాధ్యాయులుగా జీవితాంతం గుర్తుండి పోతారు. గురువులకే గురువు, భరతజాతి మెచ్చిన సర్వోన్నత విజ్ఞాన నిధి సర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ప్రేరణగా తీసుకొని, వారు చూపించిన బాటలో ముందడుగు వేయడమే వారికి మనం సమర్పించే ఘన నివాళి.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

విమోచనోత్సవంపై ఏటా రాజకీయాలు

అధికారికంగా నిర్వహించడంలో టిఆర్ఎస్ వెనుకడుగు

ఏటా డిమాండ్ చేస్తున్నా పట్టించుకోని సర్కార్

హైదరాబాద్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ప్రతి ఏడాది సెప్టెంబరు 17 వస్తోందంటే చాలు మూడునాలుగు నెలల ముందు నుంచే విమోచన దినం జరపాలంటూ ఆందోళనలు మొదలవుతాయి. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డ తరవాత ఎందుకనో టిఆర్ఎస్ ప్రభుత్వం దీని ఊసెత్తడం లేదు. దీంతో కమ్యూనిస్టులు, బిజెపిలు మాత్రమే విమోచనాత్సవాలను తమ పార్టీ కార్యక్రమాలుగా నిర్వహిస్తూ వస్తున్నాయి. తెలంగాణ విమోచనోత్సవంపై వివాదాలు సద్దుమణగలేదు. ఏటా దీనిపై రాద్ధాంతాలు సాగుతూనే ఉన్నాయి. కరోనా కారణంగా ఇప్పుడిప్పుడే రాజకీయ కార్యకలపాలు ఊపందుకున్నాయి. నేతలు మళ్లీ ప్రజల్లోకి వెళుతున్నారు. దీంతో బిజెపి మళ్లీ స్వరం వినిపిస్తోంది. భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరవాత ఓ ఏడాది ఆలస్యంగా తెలంగాణ విమోచన జరిగినా నేటికీ వివాదాలు సద్దుమణగడం లేదంటే అందుకు పాలకులే కారణం. ఏటా దీనిపై పెద్ద రాద్ధాంతమే జరుగుతోంది. అధికారంలో ఎవరు ఉన్నా విమోచనోత్సవాలను జరపక పోవడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. అయితే ఓటు బ్యాంక్ రాజకీయాలకు ఇది ఓ అస్త్రంగా మారింది. నిజానికి ఏ రాజకీయ నాయకుడైనా అధికారం దక్కేవరకు ఒకలా..దక్కినాక మరోటా ఉంటాడని భారత రాజకీయాలను గమనిస్తే అర్థం చేసుకోవచ్చు. అందుకు సిఎం కెసిఆర్ అతీతుడు కాదని కూడా నిరూపించుకున్నారు. తెలంగాణ ఉద్యమం జోరుగా సాగుతున్న వేళ విమోచనం దినం ప్రభుత్వమే నిర్వహించాలని కెసిఆర్ గట్టిగా డిమాండ్ చేశారు. కర్నాటక, మహారాష్ట్రల్లో నిర్వహిస్తున్నప్పుడు ఇక్కడ ఎందుకు నిర్వహించరని అన్నారు. అయితే ఆనాడు డిమాండ్ చేసిన మాట నిజమే అయినా, అప్పటి పరిస్థితులు, కారణాలు వేరని ఇప్పుడు గుర్తించి ఉంటారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత ఇప్పుడు విమోచనోత్సవానికి ప్రాధాన్యం లేదన్న భావనలో సిఎం కెసిఆర్ ఉన్నారు. అందుకే ఆరేళ్లుగా ఏనాడు కూడా దాని జోలికి వెళ్లలేదు. తెలంగాణ ఉద్యమ సమయంలో వివోచనోత్సవాలను జరపాలని టిఆర్ఎస్ అధినేతగా డిమాండ్ చేసిన కెసిఆర్, సొంత రాష్ట్రం ఏర్పడి సిఎం అయినాక కూడా గత పాలకుల విధానాలనే అనుసరిస్తూ వస్తున్నారు. అందుకే విమోచనోత్సవాలను జరపడం లేదు. ఉద్యమ సమయంలోనే ఓ పక్క విమోచన దినం నిర్వహించాలని డిమాండ్ చేసిన కేసీఆర్ నిజాంను, ఆయన పరిపాలనను గొప్పగా ప్రశంసించారు. బ్రిటిష్ వాళ్లను పొగిడినప్పుడు నిజాంను పొగడడంలో తప్పులేదని వాదిస్తూ వవస్తున్నారు. నిజాంను ప్రశంసించిన కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. అంతటితో ఊరుకోకుండా టిఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని, అన్ని మతాలు, కులాలను కలుపుకొని వెళుతున్నదని చాటుకున్నారు. ఆనాడు ఉద్యమంలో కొన్ని విషయాలు అప్పటి అవసరాలకు అనుగుణంగా ఉద్దేశపూర్వకంగానే మాట్లాడినట్లు ఓ సందర్భంలో కెసిఆర్ చెప్పారు. అయితే నిజాంను పొగుడుతూ విమోచనదినం పక్కన పెట్టిన సిఎం కేసీఆర్ నిజాం మీద పోరాడిన వీరుల, కవుల, రచయితల జయంతులు, వర్ధంతులు ఘనంగా, అధికారికంగా నిర్వహిస్తున్నారు. కొమురం భీమ్, చాకలి ఐలమ్మ, దాశరథి, కాళోజీ, వట్టికోట ఆళ్వారు స్వామిలాంటి వారిని ఎందరినో స్మరించు కుంటూ ఘనంగా గౌరవిస్తున్నారు. నిజాం మీద పోరాడినందుకు వారిని గౌరవించడం అన్న విషయం తెలియకుండా వారిని తెలంగాణ వైతాళికులుగా కీర్తిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ బిడ్డలకు గౌరవం దక్కలేదని, ప్రత్యేక తెలంగాణలో వీరిని గౌరవించడం ధర్మమని చెబుతున్నారు. భారతదేశం బ్రిటిష్ పాలనలో మగ్గుతున్నప్పుడు దేశమంతా 550 పైబడిన సంస్థానాలతో రాచరిక వ్యవస్థ కొనసాగుతుండేది. రాచరిక పాలనలో ప్రజలకు ఎలాంటి స్వేచ్ఛా హక్కులూ ఉండేవి కాదు. ప్రధానంగా హైదరాబాద్ సంస్థానంలో 225 సంవత్సరాల సుదీర్ఘకాలం ఆసఫ్ జాహి వంశస్థుల రాచరిక వ్యవస్థ కొనసాగింది. దేశంలోని మిగతా సంస్థానాల కంటే భిన్నంగా విధివిధానాలు, చట్టాలు, స్వంత కరెన్సీ 'హాలీ సిక్కా' లాంటివి అమలులో ఉండేవి. హైదరాబాద్ సంస్థానం భారత్ యూనియన్‌లో విలీనం జరగడం, కెసిఆర్ నాయకత్వంలో మళ్లీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడడం జరిగింది. అయినా విమోచన డిమాండ్ మాత్రం నెరవేరడం లేదు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక తాను స్వతంత్రంగా ఉంటానని లేదా పాకిస్తాన్‌లో కలుస్తానని, ఇండియన్ యూనియన్‌లో కలవనని హైదరాబాద్ నిజాం ప్రభువు మొండికేసిన విషయం తెలిసిందే. అయితే సంస్థానాలను విలీనం చేస్తూ వచ్చిన ఆనాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నిజాంపై సైనిక చర్యకు దిగి దారికి తెచ్చారు. నిజాం రాష్ట్రంపై పోలీసు చర్య తీసుకొని దాన్ని 1948 సెప్టెంబరు 17న ఇండియన్ యూనియన్‌లో విలీనం చేశారు. దీంతో నియంతృత్వ, దుష్ట పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగింది.

శాసనసభలో అన్ని అంశాలపై సమగ్ర చర్చ

ఎన్ని రోజులైనా నిర్వహించడానికి సిద్ధం

ఈ సమావేశంల

మేధావులను నిర్లక్ష్యం చేసింది నిజంకాదా?

ఆదిలాబాద్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఉద్యమంలో చేయూతనిచ్చి, ముందుకురికిన మేధావులు కేసీఆర్ పాలనను ఛీకొడుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి కలవేన శంకర్ అన్నారు. మేధావులు ఏనాడు పట్టించుకోకుండా, వారి ఆలోచనలను పంచుకోకుండా చేసిన ఘనత సిఎం కెసిఆర్‌దన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నీరుగార్చిన టిఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదన్నారు. ప్రజలను నిజాం నిరంకుశ పాలనలోకి తీసుకుని వెళ్లిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై చర్చ చేస్తే ఏమేర అభివృద్ధి జరిగిందో తెలుస్తుందన్నారు. విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు, పోరాట యోధులంతా కెసిఆర్‌కు మద్దతు ఇచ్చినందుకు పాశ్చాత్తాపపడుతున్నారని అన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీ హామీని విస్మరించడం సరికాదు

కడప,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): కేంద్రం కడపలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు విషయంలో ఏళ్లు గడుస్తున్నా స్పష్టత ఇవ్వడం లేదని సిపిఎం నాయకులు,రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకులు విమర్శించారు. ఈ ప్రాంత ప్రజలను వంచించడమేనని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ఆంజనేయులు అన్నారు. కేంద్రంలోని బిజెపి హామీలను విస్మరించడం దారుణమన్నారు. విభజన హామీలను కూడా తుంగలో తొక్కిందన్నారు. రాయలసీమకు కనీసం రూ.50 వేల కోట్లు కేటాయించాలన్నారు. దళితులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని తద్వారా వందల దళిత కుటుంబాల జీవితాలైనా బాగుపడుతాయన్నారు. విభజన చట్టంలో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పొందుపరిచారని, ఇక్కడున్న సంపదతో సుమారు 80 ఏళ్ల పాటు ఉక్కు పరిశ్రమకు తిరుగుండదని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమ ప్రాంతంపై అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనలు తప్పవని చెప్పారు. వెనుకబడ్డ రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యా, వైద్య సంస్థల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక ప్యాకేజీతోనే రాష్ట్రం, రాయలసీమ అభివృద్ధి చెందుతుందని అన్నారు.

చెరకు రైతుల సమస్యలు తీర్చాలి

విశాఖపట్టణం,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): చోడవరం సుగర్ ఫ్యాక్టరీ దక్షిణాదిలోనే అగ్రగామిగా ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు, పాలకవర్గం అవినీతి, అసమర్థత తోడై ఆర్థికంగా నష్టాల్లోకి చేరిందని చెరకు రైతుల సంఘం నేతలు పేర్కొన్నారు. నష్టాలు చూపుతూ రైతులకు బకాయిలు చెల్లించడం లేదన్నారు. ఎంఎల్ఎలు, ఎంపిలు ప్రతి యేటా వారి వేతనాలు, అలవెన్సులు పెంచుకునేందుకు తాపత్రయం పడున్నారే తప్ప రైతులకు గిట్టుబాటుధర కల్పించేందుకు కృషి చేయలేదని విమర్శించారు.సహకార ఫ్యాక్టరీలను పరిరక్షించుకోవడానికి రైతులు నడుం బిగించాలని అన్నారు. రైతులు, కార్మికుల కష్టంతో ఈ ఫ్యాక్టరీ అనేక అవార్డులు సొంతం చేసుకుందన్నారు. జిల్లాలో చెరకు సాగుకు పెట్టుబడులు అధికమవుతున్న నేపథ్యంలో రైతులు ఈ పంటకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టన్నుకు రూ.2500 చొప్పున ఇచ్చి తీరుతామని పాలకవర్గం ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. వెంటనే బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలన్నారు.

పర్యాటక ప్రాంతంగా గాదేగుమ్మి

విశాఖపట్టణం,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): ప్రముఖ గాదేగుమ్మి జలపాతం పర్యాటక శోభను సంతరించు కుంటోంది. వర్షాలు పడడంతో నీటి జాలువారు కారణంగా ఈ ప్రాంతం పచ్చని తివాచి పరుచుకుంది. సహజసిద్ధమైన కొండలు అందాలు ఇక్కడ ప్రత్యేకంగా ఆకర్షిస్తాయి. ఇక్కడికి వచ్చేవారు దగ్గర నుంచి దీని అందాలను తిలకించేందుకు అనుకూలంగా షెడ్లను ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ పోకిరీల బెడద కారణంగా పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. ఇది ఎందరినో పొట్టన పెట్టుకున్నప్పటికీ దీనిని చూసేందుకు అన్ని కాలాల్లోనూ పెద్ద సంఖ్యలో వస్తున్నారు. వారంతా జలపాతాన్ని నేరుగా తిలకించేందుకు అనువుగా షెడ్లను నిర్మించారు. వర్షాకాలం కావడంతో జలపాతం నీరు షెడ్లను తాకుతోంది. వీటిల్లో నుంచి చూస్తే ఉవ్వెత్తున పారుతున్న నీరు ఆకట్టుకుంటోంది. కార్తీక మాసంలో ఇక్కడ పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ షెడ్లలోనే కొందరు మద్యం సేవిస్తున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. సీసాలను దూరంగా పారేయకుండా పగులగొడుతున్నారు. దీంతో గాజు ముక్కలు ఆ ప్రాంతమంతటా పడి ఉంటున్నాయి.

లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి చేపట్టాలి

-సింగరేణి అధికారులకు సిఎండి ఆదేశాలు

హైదరాబాద్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ):సెప్టెంబర్‌లో లక్షా 30 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం చేరుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ సూచించారు. ఆ మరకు ఉత్పత్తితో పాటు రవాణా కూడా జరగాలని అదికారులకు నిర్దేశించారు. కరోనాతో మూడు నెలలుగా సింగరేణి బొగ్గుకు కొంత డిమాండ్ తగ్గినప్పటికీ ఇప్పుడు పరిశ్రమలన్ని కోలుకోంటున్న నేపథ్యంలో తిరిగి బొగ్గుకు డిమాండ్ పెరుగనున్నదన్నారు. తాజాగా ఏరియాల వారీగా నిర్దేశిరచిన బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్ బర్డెన్ లక్ష్యాలను సాధించాలని శ్రీధర్ అన్ని ఏరియాల జీఎంలను ఆదేశించారు. గురువారం ఆయన హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సంస్థ డైరెక్టర్లు, అడ్వయిజర్లు, అన్ని ఏరియాల జీఎంలతో బొగ్గు ఉత్పత్తి, రవాణా, కరోనా పరిస్థితులపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సింగరేణి ద్వారా బొగ్గు స్వీకరిస్తున్న పరిశ్రమల నుంచి బొగ్గుకు క్రమంగా డిమాండ్ పెరుగుతున్నందున ఇప్పుడు బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని జీఎంలను ఆదేశించారు. సెప్టెంబర్ నెలలో రోజుకి లక్షా 30 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యంగా పనిచేయాలన్నారు. అలాగే అక్టోబర్ లో లక్షా 50 వేల టన్నులు, నవంబర్ లో లక్షా 60 వేల టన్నుల నుంచి లక్షా 80 వేల టన్నుల మేర బొగ్గు ఉత్పత్తి, రవాణా చేస్తూ సింగరేణి లక్ష్యాలను తిరిగి యథాస్థితికి తేవాలని కోరారు. ముఖ్యంగా ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓవర్ బ్డ్గ÷న్ తవ్వకాలు మరింత పుంజుకోవాలన్నారు. సగటున రోజుకి ఇకపై 13 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించాలని ఆదేశించారు. కొత్త ఓసీ గనుల్లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల మేర రావాలని కోరారు. రామగుండం1 ఏరియాలో ప్రారంభించనున్నజీడికేన్ ఓసీ గనికి సంబంధించిన అన్ని రకాల అనుమతులు వెంటనే పూర్తి చేసి జనవరి నెలలో ఉత్పత్తి ప్రారంభమయ్యేలా సన్నాహాలు ముమ్మరం చేయాలన్నారు. కరోనా టెస్టులు మరింత పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. కొత్తగా ప్రారంభం కానున్న ఓసీ గనులకు అవసరమై ఉన్న అనుమతుల పనులు ఇంకా వేగవంతం చేయాలని ఆదేశించారు.

సాగర్ హైవేపై బోల్తాపడ్డ కారు: ఊడుగురు మృతి

నల్గొండ,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు చనిపోయారు. చింతపల్లి మండలం వింజమూరు దగ్గర హైదరాబాద్-సాగర్ హైవేపై కారు బోల్తా పడడంతో ఈ ప్రమాదం జరిగింది. కారులో ఐదుగురు ప్రయాణిస్తున్నారు. నలుగురు అక్కడికక్కడే మరణించారు. మరోవ్యక్తి తీవ్రగాయాలుపాలు కాగా.. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆ వ్యక్తి కూడా మృతిచెందాడు. అతివేగం, నిద్రమత్తు ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురు మృతిచెందారు.. హైదరాబాద్ నుంచి మల్లేపల్లి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఐదుగురు మృతి తీవ్ర విషాదాన్ని నింపింది.

రాజీపడని నేతలు వారిద్దరూ

సేంద్రియ సాగుకోసం నిరంతర తపన
ఆధునిక రాజకీయాల్లో ఆదర్శనేతలుగా గుర్తింపు
నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన ముత్యం,సోలిపేట

సిద్దిపేట,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఎమ్మెల్యేలుగా పనిచేసిన ఇద్దరు నేతలు కన్ను మూశారు. ఏడాది తేడాలో చెరుకు ముత్యం రెడ్డి, రామలింగారెడ్డిలు ఇద్దరూ మృతి చెందారు. ఇద్దరిదీ రైతు నేపథ్యమే కావడంతో ఇద్దరూ వ్యవసాయం కోసం తపించారు. తమ ప్రాంతాన్ని వ్యవసాయికంగా నిలబెట్టాలని కష్టపడ్డారు. రైతులంతా సేంద్రియ పద్ధతుల్లోనే వ్యవసాయం చేసి, ఆధునిక పద్ధతుల్లో లాభాలు గడించాలని పదేపదే సూచించేవారు. దివంగత చెరుకు ముత్యం రెడ్డి ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలిచారు. ఇందిరప్రభ ద్వారా దుబ్బాక నుంచే సామూహిక వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. చేర్వాపూర్‌ను దత్తత తీసుకుని పందిరి సాగును ప్రోత్సహించారు. రైతులు నేరుగా మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు అమ్ముకోవడం కోసం రైతుబజార్‌కు, సెక్రటేరియట్‌కు బస్సు సౌకర్యం కల్పించారు. ప్రాజెక్టులు కడితే రైతులు బాగుపడతారని ఆకాంక్షించేవారు.సేంద్రియ వ్యవసాయం అంటే ఆయనకు ప్రాణం. వ్యవసాయం బాగుపడాలని కలలు కన్న ఆదర్శ రైతు ఆయన. ఇక్కడి రైతులు అప్పుల ఊబిలో కూరుకుని పోకుండా వారికి నిరంతరంగా గైడ్‌గా ఉంటూ నిఖార్సయిన రైతుగా తనువు చాలించిన మహానుభావుడు చెరుకు ముత్యం రెడ్డి. తహాగా రైతు అయిన ముత్యంరెడ్డి ఏ పదవిలో ఉన్నా వ్యవసాయాన్ని వదిలి ఉండేవారు కాదు. రైతుగా మట్టిలో బంగారం పండించాలని ఆకాంక్షించేవారు. ఆయన రాజకీయ నేతగా ఎదిగినా ఎక్కడా తన మూలాలలను వదులుకోలేదు. లంచం అన్న మాట వింటే మండిపడేవారు. ఎవరైనా అదికారి పనిచేయకుంటేనిలదీసే లక్షణం ఆయను ఉండేది. అందుకేరాజకీయ రంగంలోనూ ఇతరులకు ఆదర్శంగా నిలిచిన, ఆధునిక రాజకీయాలు వంటపట్టించుకోక పోవడం వల్ల ఎదగలేక పోయారు. రామలింగారెడ్డి కూడా క్షేత్రస్తాయిలో ప్రజల సమస్యలపై ఎలుగెత్తేవారు. నిరంతరంగా వారి కోసం తపించేవారు. జీవితపర్యంతం ప్రజల మధ్యే ఉంటూ వారికి చేదోడువాదోడుగా ఉన్నా ఓటమిని మాత్రం తప్పించుకోలేక పోయారు. వారితో మమేకమవుతూ వారి బాగోగులను తెలుసుకుంటూ వారి అభివృద్ధి కోసం శ్రమించారు. ముత్యంరెడ్డి మచ్చలేని నాయకుడంటూ ప్రత్యర్థి పార్టీల నేతలు కూడా కొనియాడినా ఏనాడూ స్వార్థం కోసం పనిచేయలేదు. నిగర్వినాగానే చివరి వరకు జీవితం సాగించిన మంచి రైతునేస్తం చెరుకుముత్యం రెడ్డి. పదవుల్లో కొనసాగినా సాధారణ జీవితాన్నే గడిపారు. టిడిపిలో ఉన్నంతకాలం ముత్యం రెడ్డి దుబ్బాక రైతుల సంక్షేమానికి నిరంతరంగా కృషి చేశారు. వ్యయసాయ సంబంధ పథకాలు ఏవి వచ్చినా ముందు దుబ్బాకలో ఉండేవి.తొగుట సింగిల్ విండో చైర్మన్‌గా ఆయన తన రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టారు. 1970 నుంచి 18ఏళ్లపాటు తొగుట సర్పంచ్‌గా పనిచేశారు.దొమ్మాటలో 1989 నుంచి ఎమ్మెల్యేగా వరుసగా మూడుసార్లు గెలిచారు. 1999లో పౌర సరఫరాల శాఖ మంత్రిగా పని చేశారు. 2004లో ఓటమి పాలయ్యారు. 2009లో మహాకూటమి పొత్తుతో ఆయనకు టికెట్ రాలేదు. అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి పిలిచి కాంగ్రెస్ టికెట్ ఇచ్చారు. పార్టీ అభ్యర్థిగా గెలిచి, టీటీడీ దేవస్థానం సభ్యుడిగా, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా పదవులు పొందారు. విచిత్రం ఏమో కానీ దివంగత రామలింగారెడ్డి కూడా అంచనాల కమిటీ ఛైర్మన్‌గానే ఉంటూ మరణించారు. ఇద్దరు నేతలు దుబ్బాకను అభివృద్ధి చేయడంలో రాజీపడలేదని చెప్పొచ్చు.

సైలెంట్‌గానే ఉంటున్న విద్యాసాగర్ రావు

పార్టీ బలోపేతంపై పెదవి విప్పని సీనియర్

హైదరాబాద్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): కేంద్ర మంత్రివర్గంలో కిషన్ రెడ్డి చేరాక, మాజీమంత్రి దత్తాత్రేయకు గవర్నర్‌గా నియమించాక... తెలంగాణ ప్రాధాన్యం పెరగిందనుకున్నా తెలంగాణకు సంబంధించి పెద్దగా కార్యక్రమాలుమాత్రం ఏమీ సాగడం లేదు. మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్న విద్యాసాగర్ రావును మళ్లీ పార్టీ కోసం పనిచేయిస్తారని అనుకున్నా ఆయన సైలెంట్‌గానే ఉన్నారు. తెలంగాన రాజకీయాల్లో చురుకుగా ఉండేలా చేస్తారని అంతా భావించినా..పార్టీ పరంగా ఆయనకు పదవులు కట్టబెట్టలేదు. దీంతో ఆయన తెలంగాణ రాజకయీఆల్లో ఎక్కడా కనఎడడం లేదు. కేంద్రస్థాయిలో తెలంగాణకు స్థానం పెరగడంతో ఇప్పుడు పార్టీ పరంగా ముందుకు వెళ్లడంలో అనుకూలతలు వచ్చాయని పార్టీ నేతలు భావించారు. కేంద్ర సర్కార్‌లో తెలంగాణ వాయిస్ బలంగా ఉండి పోయిందన్న భావన పార్టీ నేతల్లో ఉన్నా..ఇక్కడ మాత్రం పెద్దగ ఆప్రభావం కానరావడం లేదు. లక్ష్మణ్‌ను మార్చే సమయంలో అంతా విద్యాసాగర్ రావును నియమిస్తారని అనుకున్నా యువకుడు, బిసి అయిన బండి సంజయ్‌ను నియమించారు. బండారు దత్తాత్రేయను గత ఎన్నికల ముందు పక్కకు పెట్టడం, ఆ వెంటనే మురళీధర్ రావు, వెదిర శ్రీరాంల పేర్లు తెరపైకి వచ్చాయి. తెలంగాణకు ఒకటి,లేదా రెండు మంత్రి పదవులు లభిస్తాయని ఆశించగా కిషన్ రెడ్డి ఒక్కరికే కీలకమైన హోంశాఖ సహాయమంత్రి పదవి దక్కింది. ఇక మంత్రి పదవి నుంచి వైదొలగిన నాటినుంచి దత్తాత్రేయ మాత్రం గవర్నర్‌గిరిపై ఆశలు పెట్టుకున్నారు. అనుకున్నట్లుగానే ఆయనకు హిమాచల్ గవర్నర్ పదవి దక్కింది. అయితే కేంద్ర నాయకత్వానికి రాష్ట్ర పరిస్థితిని ఎప్పటికప్పుడు వివరించే నేతలు ఇప్పుడు కరువయ్యారు. జాతీయ పార్టీ ప్రధానకార్యదర్శి మురళీధర్‌రావు ఇప్పుడు పార్టీ కార్యక్రమాలతో మరింతగా బలంగా..తెలంగాణలో అంతంతమాత్రంగా ఉన్న బిజెపి ఇప్పుడు మరింతగా దూసుకుని పోతోందని ఎవరూ భావించడం లేదు. మహారాష్ట్ర గవర్నర్‌గ్గా రిటైర్ అయిన విద్యాసాగర్ రావు ఇప్పుడు క్రీయశీలకంగా ఉంటారా లేదా అన్నది చూడాలి. రాష్ట్ర రాజకీయాల్లో పెద్దగా మార్పులు మాత్రం కానరావడం లేదు.

కాంగ్రెస్ విమర్శలను కట్టిపెట్టాలి

ప్రాజెక్టులపై వారి వాదన అబద్ధాలతో కూడినది: బోడకుంటి

హైదరాబాద్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): ఎవరు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మండలిలో చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు అన్నారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. చేస్తున్న అభివృద్ధిని తట్టుకోలేక ప్రతిపక్షాలు ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు, ప్రొఫెసర్ కోదండరాం నిత్యం లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పాలనలో లోపాలు ఉంటే ఎత్తి చూపండి.. సరిదిద్దుకుంటాం కానీ, పనిగట్టుకొని ఆరోపణలు, లేనిపోని ప్రచారాలు చేస్తే ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు చెప్పిన విషయాన్ని పదేపదే చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి మరో 20 ఏండ్లు తిరుగులేదని పేర్కొన్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌తోపాటు వారి కుటుంబంపై ప్రతిపక్షాలు వ్యక్తిగత ఆరోపణలు చేయడం తగదని, వారి వైఖరి మార్చుకోవాలని సూచించారు.ఇప్పటికైనా కోదండరాం వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవుపలికారు.

ఇకపోతే రైతు సంక్షేమం గురించి సీఎం కేసీఆర్ నిత్యం ఆలోచిస్తున్నారని అందుకే రైతులకుపెట్టబడి అందించేందుకు ఎకరాకు ఐదువేల పెట్టుబడి పథకం రూపుదిద్దుకుందని ఎమ్మెల్సీ చెప్పారు. ప్రాజెక్టులు పూర్తిచేసిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. కోటిన్నర ఎకరాలకు సాగునీరు, 24 గంటల నాణ్యమైన విద్యుత్తు, గిట్టుబాటు ధర, నాణ్యమైన విత్తనాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు. రైతుల బలోపేతానికి రైతు సంఘాల ఏర్పాటుతోపాటు భూమి రికార్డుల సమగ్ర ప్రక్షాళన కార్యక్రమం చేపట్టిన్నట్టు వివరించారు. అయితే కాంగ్రెస్ నేతలు కోర్టుల్లో కేసులు వేస్తూ, సాగునీటి ప్రాజెక్టులకు అడ్డుపడుతూ తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అభివృద్ధిపై విమర్శలు చేస్తూ కాంగ్రెస్ నేతలు చరిత్రహీనులుగా మారరాదని సూచించారు. ఉనికి కోసం రైతుల నోట్లో మట్టికొట్టే విధంగా వ్యవహరించడం తగదని హితవు పలికారు. అధికారంలో ఉన్నప్పుడు కాసులకు కక్కుర్తి పడిన కాంగ్రెస్ నేతలు రైతుల సంక్షేమాన్ని విస్మరించారని, ప్రాజెక్టులను గాలికొదిలారని, ఇప్పుడు మాత్రం ఉనికి కోసం పనిచేసే ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ నేతల మాటలు నమ్మవద్దని రైతులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే కాలం చెల్లిన పార్టీ అని, అభివృద్ధికి అడ్డం పడటమే వారు చేస్తున్న కార్యక్రమాలని పేర్కొన్నారు.

కరోనా భయాలు అప్పుడే తొలగిపోలేదు

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలి
ప్రజల ఆందోళనలపై మౌనం సరికాదు: బిజెపి

హైదరాబాద్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): తెలంగాణ విమోచన దినోత్సవంపై ఏటా ఆందోళనలు జరుగుతన్నా సిఎం కెసిఆర్ దీనిపై స్పందించక పోవడం రాజకీయం కాక మరోటి కాదని బిజెపి నాయకుడు ఎమ్మెల్సీ రామచంద్ర రావు అన్నారు. ఇదంతా ప్రజలను వంచించడం తప్ప మరోటి కాదన్నారు. కేవలం ఎంఐఎంపు సంతృప్తి పరచడానికి తెలంగాణ ప్రజలను వంచించడం తప్పమరోటి కాదన్నారు. తెలంగాణ వచ్చిన ఆరేళ్లుగా మౌనం వహించిన ప్రజలు ఇప్పుడు నిలదీస్తున్నా సమాధానం చెప్పడం లేదన్నారు. కేసీఆర్ పూటకోమాట మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం చెబుతున్నది ఒకటి చేస్తున్నది మరొకటి అని పేర్కొన్నారు. అమరుల త్యాగాలను రాజకీయం చేయొద్దని కోరారు. సెప్టెంబరు 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించే విషయంలో ఇబ్బంది ఉంటే కనీసం కారణాలు చెప్పాలని అన్నారు. దేశవ్యాప్తంగా తెలంగాణాతో కలిపి పలు రాష్ట్రాలు విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధివిధానాలను రూపొందించి ప్రజల అభీష్టాలను గౌరవించాలని కోరారు. తెలంగాణ పోరాటానికి ఘనమైన చరిత్ర ఉందని, భారత దేశంలో విలీనానికి ముందు ప్రజలు పడ్డ బాధలు, మహిళలు ఎదుర్కొన్న అవమానాలు, అమరుల త్యాగాలు ఎన్నో ఉన్నాయని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. 17ను అధికారికంగా ప్రకటిస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని చెప్పడం వంచించడమేనని అన్నారు. సెప్టెంబరు 17న తెలంగాణ విలీన ఉత్సవాలను తెరాస ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందిన రోజు సెప్టెంబరు 17న తెలం గాణ విలీన ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. ఇలా చేయడం తెలంగాణ గౌరవాన్నికాపాడుకుని అమరులను స్మరించుకోవడం అవుతుందని అన్నారు.

అప్పులు చెల్లించలేక ఆత్మహత్య యత్నం

-గుర్తించి ఆస్పత్రిలో చేర్చిన పోలీసులు

గుంటూరు,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): రుణం చెల్లించలేక వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. గుంటూరు జిల్లా చిలువేరు గ్రామంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన సుభాని అనే వ్యక్తి తెలిసిన వారి వద్ద రూ. 15 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పుచ్చిన వారు తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయడంతో పనిచేసే ఆభరణాల దుకాణం నుంచి డబ్బులు అపహరించాడు. విషయం బయట తెలిస్తే పరువు పోతుందని భావించి బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి శీతల పానీయంలో పురుగు మందు కలుపుకొని సేవించాడు. అంతకుముందు ఆత్మహత్య చేసుకునేందుకు గల కారణాలను వెల్లడిస్తూ సెల్ఫీ వీడియో తీసి స్నేహితులకు పంపాడు. అప్రమత్తమైన అతడి స్నేహితులు పోలీసులను సంప్రదించారు.

పాలమూరు ప్రాజెక్టులను అడ్డుకోవద్దు

మహబూబ్‌నగర్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అడుగడుగునా అడ్డు తగులుతూ నీచరాజకీయాలు చేసేవారికి తెలంగాణలో స్థానం లేదని మాజీ జెడ్పీ చైర్మన్,టిఆర్ఎస్ నేత బండారి భాస్కర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు పాలమూరు ప్రాజెక్టులను అడ్డుకునే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రైతు కంటకులుగా మారిన వీరు ఎన్నిఎత్తులు వేసినా పాలమూరు ప్రాజెక్టును అడ్డుకోలేరని, అవిభక్త పాలమూరు జిల్లాను కోసేసీమను తలదన్నేలా మార్చేందుకు సీఎం కేసీఆర్ కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నారని పునరుద్ఘాటించారు. పాలమూరు రైతుల బతుకులను మార్చాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారని అన్నారు. అయితే కాంగ్రెస్ నేతలు అడుగడుగునా అడ్డు తగులుతున్నా, పనులు వేగంగా సాగుతున్నాయని ఆనందం వ్యక్తంచేశారు. రాష్ట్రానికి కాంగ్రెస్ నేతలు శనిలా మారారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డికి కూడా జిల్లా ప్రయోజనాలు పట్టడం లేదన్నారు. ప్రాజెక్టులకు అడ్డం పడటం కాదని, చిత్తశుద్ధి ఉంటే సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వంతో కలిసిరావాలని హితవుపలికారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

వరంగల్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆందోళనలు చేస్తున్నా పట్టించుకో పోవడం సరికాదన్నారు. పాతపెన్షన్ అమలు చేసే వరకు ఐక్య పోరాటాలు కొనసాగుతాయని హెచ్చరించారు. సంఘటిత పోరాటాలతోనే ప్రభుత్వానికి కనువిప్పు కలిగి సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. డెమొక్రటిక్ టీచర్స్ ఆర్థిక సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలో భాగంగా ప్రంపచబ్యాంకు ఆదేశాల మేరకు ప్రభుత్వాలు ఉద్యోగుల ప్రయోజనాలను విస్మరిస్తున్నాయని చెప్పారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. దీనిని తక్షణం ఎత్తేసి పాత విధానం కొనసాగించాలన్నారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని అన్నారు.

బిజెపి బలమైన శక్తిగా వస్తోంది

-అధికార ప్రతినిధి రఘునందనర్ రావు

సిద్దిపేట,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో బిజెపి బలమైన కూటమిగా రానుందని, ఒంటరి పోరుతోనే ముందుకు వెళతామని ఆ పార్టీ అధికార ప్రతినిధి రఘునందన్ రావు అన్నారు. బీజేపీ అనే ఓ పార్టీ ఏడున్నదో ఎవరికీ తెలియదంటూ గతంలో విమర్శలుచేసిన సిఎంకెసిఆర్ ఇప్పుడు బిజెపిని చూసి భయపడే పరిస్తితులు ఉన్నాయని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పూర్తి చేయలేదని భయంతో కేసీఆర్ ప్రజలను ఏదో ఓ తీరుగా వంచించే ప్రయత్నంచేస్తున్నారని చెప్పారు. ప్రజలు సైతం తెరాస పాలనను వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. గతంతో పోలిస్తే భాజపా వైపు యువత ఎక్కువ మొగ్గుచూపుతున్నారని అన్నారు. 370 ఆర్టికల్ రద్దు తరవాత దేశంలో బిజెపి పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందని అన్నారు. తాము అధికారంలోకి వస్తే రాజకీయ అవినీతిని నిర్మూలిస్తామని, పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతోనే తెలుగుదేశం పార్టీ అడ్రస్ గల్లంతైందన్నారు. అందుకే ఆ పార్టీలోని నేతలంతా బిజెపి వైపు చూస్తున్నారని అన్నారు.

కాంగ్రెస్‌పై విమర్శలతో ప్రజలను మభ్యపెట్టలేరు

-ప్రజలకిచ్చిన హామీలపై సమాధానం ఇచ్చుకోవాల్సిందే

కరీంనగర్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్‌పై నిందలు మోపిన కెసిఆర్‌ను, టిఆర్ఎస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. క

విద్యావేత్త బహుముఖ ప్రజ్ఞాశాలి తెలుగువాడు-మన సర్వేపల్లి

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సెప్టెంబరు, 5 న 1888 న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీ.ల దూరమున ఉన్న తిరుత్తణిలో తమిళనాడుకు వలసవెళ్ళిన తెలుగు దంపతులైన సర్వేపల్లి వీరాస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించారు. వీరాస్వామి ఒక జమీందారిలో, తాహసీల్దార్‌గా వృత్తిని కొనసాగించారు. వారి మాతృభాష తెలుగు, రాధాకృష్ణన్ బాల్యం నుండి అసాధారణమైన తెలివితేటలు కలిగి ఉండేవారు. జీవన సోపాన పథంలో ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించి, అత్యున్నతమైన రాష్ట్రపతి పీఠం అధిరోహించిన మహామనిషి. కనుకనే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మించిన సెప్టెంబరు, 5వ తేదీని ఉపాధ్యాయలోకానికి కలిగిన గుర్తింపుగా దేశమంతా జాతీయ ఉపాధ్యాయదినోత్సవ సంబరాలు జరుపుకోవడం జరుగుతుంది.

బాల్యం, విద్యాభ్యాసం:

రాధాకృష్ణన్ ప్రాథమికవిద్య, తిరుత్తణిలోని కె.వి. హైస్కూలులోనూ, హైస్కూలు చదువు, తిరువతిలోని లూథరన్ మిషన్ స్కూలు, వాలాజాపేటలో ప్రభుత్వ హైయ్యర్ సెకండరీ విద్యని పూర్తి చేసారు. బాల్యదశలో చాలా ఏళ్ళు తిరుత్తణి, తిరుపతి పుణ్యక్షేత్రాలలోనే గడిపారు. ఆయన విద్యాభ్యాసమంతా క్రైస్తవుల ఆధ్వర్యంలోనే జరగడం విశేషం. బైబిల్‌లోని ముఖ్యంగా న్యూడిస్ట్‌మెంట్ బోధనలలో తనకు పరిచయమేర్పడడం ఆనందం కలిగించినా, హిందూమతంపై ద్వేషభావం కనపరచడం ఆయనకు విచారం కలుగజేసేది. ఒకవైపు సర్వమతసమానభావాన్ని అలవరుచుకుంటూనే ఆయన ఇంకొకవైపు సిసలైన హిందువుగా వివేకానందుని ప్రబోధనలకు ఉత్తేజితులవుతూ వచ్చారు. ఈ వాతావరణంలోనే 17 సంవత్సరాల యువకుడైన రాధాకృష్ణన్ మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో చేరడం, 1906 లో అక్కడ నుండి పట్టభద్రులు కావడం అదే కళాశాలలో, ఎం.ఏ. డిగ్రీ కోసం తన అభిమాన ప్రత్యేక విషయంగా వేదాంతాన్ని తీసుకున్నారు. ఎం.ఏ. డిగ్రీ పరీక్షకు, వేదాంత నీతి గురించి విమర్శనాత్మక వ్యాసం వ్రాశారు. దాన్ని అప్పటి ప్రొఫెసర్ అయిన ఎ.జి.హాగ్ ఎంతో మెచ్చుకుని అచ్చు వేయించారు. అప్పటికి రాధాకృష్ణన్ వయస్సు 20 సంవత్సరాలు.

వివాహం:

వీరికి 18 సంవత్సరాల చిరుప్రాయంలో శివకామమ్మతో వివాహం జరిగింది. వీరికి ఐదుగురు కూతుళ్ళు, ఒక కుమారుడు కలిగారు.

బోధనా చతురత:

రాధాకృష్ణన్ మద్రాసు క్రిస్టియన్ కాలేజి నుంచి, ప్రెసిడెన్సీ వేదాంత శాఖలో 1909 లో అసిస్టెంటు లెక్చరర్‌గా చేరారు. ప్రిన్సిపాల్ ఆదేశంపై చదువుకుంటున్న కాలంలోనే తరగతిలోని, తనతోటి విద్యార్థులకు మనస్తత్వ శాస్త్రంలో బోధించే అపురూపమైన అవకాశం ఆయనకు లభించింది. హిందూమత సిద్ధాంతాలను వివరిస్తూ ప్రముఖ పత్రికల్లో అనేక వ్యాసాలు వ్రాయడంతో, ఆయన కీర్తి దశదిశలా వ్యాపించింది. 1918 లో మైసూరుమహరాజ్ ఆహ్వానంపై, అక్కడ కొత్తగా ఏర్పడిన విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ ఆఫ్ ఫిలాసఫీగా చేరారు. మైసూరు సంస్థానంలో ఉన్న మూడేళ్ళ కాలంలో ప్రొఫెసర్ రాధాకృష్ణన్ వేదాంత రచయితగా తన ఖ్యాతిని సుస్థిరం చేసుకున్నారు. రాధాకృష్ణన్ వ్రాసిన రెండు పుస్తకాలు 'ఫిలాసఫీ ఆఫ్ రవీంద్రనాథ్ ఠాగూర్', రోల్ ఆఫ్ రెలిజియన్ ఇన్ కంటెపారరీ ఫిలాసఫీ' ద్వారా ఆయన పేరు అమెరికన్ ఫిలసోఫికల్ అసోసియేషన్‌కు, అధ్యక్షోపన్యాసమిస్తూ, 'ఇద్దరు ఆదర్శవాదుల ప్రతినిధుల గురించి ప్రస్తావించారు. అందులో రాధాకృష్ణన్ ఒకరు. ఆ తరువాత 1921 లో సుప్రసిద్ధ అశుతోష్ ముఖర్జీ (వైస్ ఛాన్సలర్ - కలకత్తా విశ్వవిద్యాలయం) దేశంలోని అతిముఖ్య వేదాంత ఫీఠాన్ని అలంకరించవలసినదిగా ప్రొఫెసర్ రాధాకృష్ణన్‌ను ఆహ్వానించారు. కలకత్తా విశ్వవిద్యాలయంలో, మానసిక నైతిక శాస్త్రంలో 'ఐదు జార్జి చక్రవర్తి పీఠాన్ని స్వీకరించడం కంటె గొప్ప గౌరవమేమున్నదని, ఆయన ఆ ఆహ్వానాన్ని ఆమోదించారు. కలకత్తాలో మొత్తంగా 20 సంవత్సరాలు ఉన్న కాలంలో, అనేక విదేశ ఆహ్వానాలు స్వీకరించి పటుచోట్ల ఉపన్యాసాలు చేశారు. 1926 లో, ఆక్స్ ఫర్డ్ ఆస్టిన్ స్మారక ప్రసంగాలిచ్చారు. అదే సంవత్సరం ఆగష్టులో, చికాగో విశ్వవిద్యాలయంలో హాస్కెల్ స్మారక ప్రసంగాలు చేశారు. 1927 లో డాక్టర్ రాధాకృష్ణన్ భారతీయ తత్వశాస్త్రం రెండొవ సంపుటిని, 1928 లో 'మనకు అవసరమైన మతం', 1929 లో 'నాగరికత భవిష్యత్తు', 1930 లో 'ఐడియాలిస్టిక్ వ్యూ ఆఫ్ లైఫ్', 1938 లో 'ఈస్ట్ అండ్ వెస్ట్ ఇన్ రివిజియన్' అనే గ్రంథాలను ఆవిష్కరించారు.

భాషా పాండిత్యం:

పాశ్చాత్యులను సైతం అబ్బురపరిచే ఇంగ్లీషు భాషా పాండిత్యం గలిగిన రాధాకృష్ణన్, వీరి భాషా పాండిత్యం గురించి పెక్కు ఉదాహరణలు పేర్కొనవచ్చు. ఒకసారి డాక్టర్ రాధాకృష్ణన్ యునెస్కో సమావేశంలో పాల్గొనడంతో, ఆ సభలో ప్రసంగించవలసిన ఫ్రెంచ్‌పండితుడు, డాక్టర్ రాధాకృష్ణన్ ప్రవాహతుల్యమైన ఉపన్యాసం విన్న తర్వాత, ఇక తను ఇంగ్లీషులో ప్రసంగించే ధైర్యం చాలక వారి మాతృభాషలోనే ఉపన్యసించారు. రాధాకృష్ణన్ 1931 నుండి 1936 వరకు ఆంధ్రవిశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా, ఉపన్యసించిన తన మొదటి ప్రసంగం తెలుగులో మాట్లాడుతూ, మేము ఆంధ్రులం, భారతదేశంలో సమర్థవంతమైన ఐక్యతా భావాన్ని పెంపొందించగల సామర్థ్యం ఉందంటే అది ఆంధ్రాలోనే ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను. మా మహిళలు ఎక్కువ స్వేచ్ఛను కలిగి ఉన్నారు. మాతృభాష ప్రేమ మనందరినీ బందిస్తుంది, అని మాట్లాడటంలో గల ఉద్దేశ్యం ఆంధ్రాభిమానం, ఆయనకున్న ప్రాంతీయ అవధులను దాటి విశ్వవిద్యాలయాభివృద్ధికి, విస్తృత విశాల స్థాయిలో కృషి చేశారు.

మహాత్మాగాంధీపై అభిమానం:

మహాత్ముని 70వ జన్మదినోత్సవం సందర్భంగా, 1939 లో ప్రపంచంలోని ప్రముఖులైనవారు రాసిన వ్యాసాలను సంకలనపరిచి, రాధాకృష్ణన్ ఆ గ్రంథానికి, ఉపోద్ఘాతం రాసి ప్రచురించి మహాత్మునికి జన్మదిన కానుకగా సమర్పించారు. ఆ సంవత్సరమే కాశీవిశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా నియమితులై, కాశీలో భారత సంస్కృతులకు సంబంధించి బోధన సాగించారు.

రాధాకృష్ణన్ ఖ్యాతి:

విశ్వవ్యాప్తమైన అనేక విద్యాసంస్థలు డాక్టర్ రాధాకృష్ణన్ ఉపన్యాసాలను పొందుపరచి విజ్ఞాన సంపన్నమైనాయి. 1946 లో అమెరికాలో వాట్‌మెన్ ఉపన్యాసమిచ్చారు. ప్రపంచ వైజ్ఞానిక సంస్థలో భారత ప్రతినిధి వర్గానికి, 1946 నుంచి 1950 వరకు నాయకత్వం వహించారు. 1948 లో ఆ సంస్థ ఉపాధ్యక్షులుగాను, 1949 లో దాని అధ్యక్షులుగాను ఆయన ఎన్నికయ్యారు. 1948 లో కాశీవిశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ పదవిని వదిలిపెట్టి, విశ్వవిద్యాలయ విద్యావ్యవహారాల కమీషన్ అధ్యక్ష పదవి బాధ్యతలను స్వీకరించారు. భారత దౌత్యరంగంలో డాక్టర్ రాధాకృష్ణన్ ఒక నూతన శకం సృష్టించారంటే అది అతిశయోక్తికాదు. 1949 లో మాస్కోలో భారత రాయబారిగా నియమితులై ఆయన ఆ పదవిలో 1952 వరకున్నారు. ఈ విధంగా అనేకమైన అత్యున్నత గౌరవ పదవులను ప్రతిభావంతంగా నిర్వహించి, పశ్చిమ దేశాలతో సంబంధ బాంధవ్యాల వారధిని ఏర్పాటు చేసిన మొదటి వ్యక్తిగా ఖ్యాతిని పొందారు సర్వేపల్లి.

అవార్డులు:

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు అనేకానేక ఉన్నత అవార్డులు లభించాయి. వాటిలో ముఖ్యమైనవి. 1954 - భారతరత్న అత్యున్నత పౌర పురస్కారం, 1989 - భారత దేశంలో వీరి పేరిట స్టాంపును విడుదల చేసారు. ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలైన ఆక్స్ ఫర్డ్, కేంబ్రిడ్జ్ మొదలైన వాటినుండి 100కు పైగా గౌరవపురస్కారాలు, డాక్టరేట్స్ సంపాదించారు.

ఉపాధ్యాయదినోత్సవ సందర్భం:

రాధాకృష్ణన్ ఉపాధ్యాయవృత్తిఉన్నప్పుడు, విద్యార్థులకు పాఠాలు శ్రద్ధగా బోధించడమే కాకుండా వారిపై అపార ప్రేమాభిమానాలు చూపేవారు. వారు మైసూరు నుంచి కలకత్తాకు ప్రొఫెసర్‌గా బదిలిపై వెళ్ళేటప్పుడు విద్యార్థులు గుర్రపు బండిని పూలతో అలంకరించి తమ గురువును గుర్రపు బండిలో కూర్చొబెట్టి, రైల్వేస్టేషన్ వరకు విద్యార్థులే మోసుకొని తీసుకువెళ్ళడము గురువు అయిన రాధాకృష్ణన్‌గారిపై ఉన్న అభిమానం అవధులు దాటిన గురువుశిష్యుల అనుబంధముగా చూడవచ్చు. రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు వారి శిష్యులు అభిమానులు పుట్టినరోజును ఘనంగా చేస్తాము అని కోరగా దానికి బదులు ఆ రోజును ఉపాధ్యాయదినోత్సవంగా చేయాలని కోరారట. 1962 - భారత ప్రభుత్వం వీరి పుట్టిన రోజు సెప్టెంబర్, 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించి, ప్రతియేట ఉపాధ్యాయవృత్తిలోని ఉన్నత విలువలకు, గురుశిష్యుల సంబంధానికి నిదర్శనంగా, ఉపాధ్యాయలకు అంకితంచేస్తూ జరుపుకుంటున్న ఉత్సవం. అప్పటినుండి వారి పుట్టిన రోజును ఉపాధ్యాయదినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితిగా మారింది. ఆ తేదిని ఉపాధ్యాయలకు అంకితంచేస్తూ జరుపుకుంటున్న ఉత్సవం.

ముగింపుగా:

డాక్టర్ రాధాకృష్ణన్ మొట్టమొదటి ఉపరాష్ట్రపతిగా పదేళ్ళు, ఐదేళ్ళు రాష్ట్రపతిగా ఎంతో హుందాగా పనిచేసి, ఆ పదవులకే గౌరవం చేకూర్చిపెట్టారు. భారతదేశము అత్యంత క్లిష్టకాలములో (చైనా-పాకిస్తాన్‌తో యుద్ధసమయం) ప్రధానులకు మార్గనిర్దేశం చేసారు. ఆయన హిందుమత ప్రాముఖ్యాన్ని ప్రపంచానికి తెలియచెప్పిన భారతరత్న. అనారోగ్య కారణంగా ఢిల్లీ రిపబ్లిక్ పెరెడ్‌కు హాజరుకాలేకపోయినవారు వీరు ఒక్కరే. వారు 1975 ఏప్రిల్, 17వ తేదిన తుది శ్వాస విడవడం భారత దేశానికి తీరని లోటని చెప్పవచ్చు.

-శారద శృంగేరి
సెల్: 9490261119

మావోయిస్టుల కోసం ముమ్మర కూంబింగ్

డిజి పర్యటన నేపథ్యంలో హై అలర్ట్

వరంగల్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): వరంగల్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో మావోయిస్టుల కోసం కూంబింగ్ సాగుతోంది. ములుగు, భూపాలపల్లి ఏజెన్సీ ప్రాంతాల్లో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. గుండాల ఎన్‌కౌంటర్‌తో అప్రమత్తమైన పోలీసులు నక్సల్స్ కోసం వేట మొదలు పెట్టారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో స్పెషల్ పార్టీ బృందం జల్లెడ పడుతోంది. మావోయిస్టు నేతలు దామోదర్, రాజిరెడ్డి లక్ష్యంగా కూంబింగ్ చేపట్టారు. ప్రతీకారంగా మావోయిస్టులు ఏదైనా ఘటనకు పాల్పడుతారేమోననే అనుమానంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీంతో అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు.

అలాగే ఆదిలాబాద్ జిల్లాలోని అడవుల్లో గత కొంతకాలంగా మావోయిస్టుల కదలికలు ఎక్కువవడంతో పోలీసులు వారికోసం గాలింపు చేపట్టారు. తిర్యాణి -మంగి అటవీ ప్రాంతంలో ముమ్మరంగా కూంబింగ్ కొనసాగుతున్నది. ఈనేపథ్యంలో డీజీపీ మహేందర్‌రెడ్డి మూడు రోజులుగా ఆసిఫాబాద్‌లోనే ఉన్నారు. మావోయిస్టుల కదలికపై జిల్లా పోలీసు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. భాస్కర్ దళం కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం డీజీపీ మహేందర్‌రెడ్డి బుధవారం జిల్లాలకు వచ్చారు. హెలికాప్టర్ ద్వారా జిల్లాకు చేరుకున్నారు. ఇక్కడి నుంచే ఆయన సమీక్షించారు.

అధికారులతో జిల్లాలోని పరిస్థితులపై చర్చించారు. సీపీ, ఇంటలిజెన్స్ ఎస్పీ, ఓఎన్‌డీలతో కలిసి ఏరియల్ సర్వే చేపట్టారు. జిల్లాలోని నక్సల్స్ ప్రభావిత మండలాలు, ప్రాణహిత పరివాహక ప్రాంతాలను సుమారు గంట పాటు డీజీపీ ఏరియల్ సర్వే నిర్వహించారు. జిల్లా కేంద్రానికి చేరుకుని స్థానిక అధికారులతో డీజీపీ సమీక్షించారు.

ప్రమాదంలో గాయపడ్డ నిజామాబాద్ ఎసిపి మృతి

ఖమ్మం,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం జీళ్ల చెరువు వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఏసీపీ బాలు జాదవ్ మృతి చెందారు. సికింద్రాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, నిజామాబాద్ ఏసీపీగా బాలు జాదవ్ పనిచేస్తున్నారు. తన స్వగ్రామమైన కూసుమంచి మండలంలోని లోక్యా తండాకు వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. బాలుజాదవ్ మృతిపై పలువురు సంతాపం ప్రకటించారు.

బాణాసంచా కార్మాగారంలో పేలుళ్లు

కనీసం 9మంది మరణించారని అనుమానం

చెన్నయ్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): బాణాసంచా కర్మాగారంలో పేలుళ్లు సంభవించి తొమ్మిది మంది చనిపోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన తమిళనాడు రాష్ట్రంలోని కడలూరు జిల్లా కాట్టుమన్నార్ కోయిల్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను కూడా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో బాధిత కుటుంబాల్లో విషాదం అలుముకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయులతోనే సమాజ పురోగతి

శుభాకాంక్షలు తెలిపిన ఎపి గవర్నర్

అమరావతి,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): ఉపాధ్యాయులు సమాజానికి వాస్తు శిల్పులని, భారతావని నిర్మాణంలో వారి భూమిక ఎంచదగినదని ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఉపాధ్యాయుల సహకారం లేకుండా ఏ సమాజం ప్రగతిశీల మార్గంలో పయనించలేదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులతోనే ప్రగతిశీల సమాజం సాధ్యమని పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి జన్మదినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులందరికీ గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి మొదటి ఉపరాష్ట్రపతిగా, భారత రెండవ రాష్ట్రపతిగా డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. డాక్టర్ రాధాకృష్ణన్ ఆదర్శవంతమైన విద్యావేత్త, పండితునిగానే కాకుండా తత్వవేత్తగా, రచయితగా భారత దేశానికి సేవలు అందించారన్నారు. జీవితంలో ఉన్నత నైతిక విలువలకు కట్టుబడిన మహనీయుడని గవర్నర్ కొనియాడారు.

నాణ్యతతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి: మంత్రి

మహబూబ్‌నగర్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): తగు జాగ్రత్తలతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడరాదన్నారు. అలాగే పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. మహబూబ్ నగర్ నుంచి జడ్చర్ల వరకు జరుగుతున్న పైవే విస్తరణ పనులను మంత్రి కొత్త తండ వద్ద పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహబూబ్ నగర్ రోడ్డు విస్తరణ పనులు వేగంగా చేపట్టడమే కాకుండా మిషన్ భగీరథ పైపులైన్ కు ఎలాంటి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత కాంట్రాక్టర్ పై ఉందన్నారు. నాలుగు లేన్ల రోడ్డు విస్తరణలో భాగంగా కొనసాగుతున్న పనుల వల్ల మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలిపోయి పట్టణంలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రోడ్డు విస్తరణ పనులు సైతం సాధ్యమైనంత వేగంగా పూర్తి చేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు.

మెదక్,కామారెడ్డిల్లో చిరుతల సంచారం

-ఆందోళనకు గురవుతున్న స్థానిక ప్రజలు

మెదక్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): మెదక్,కామారెడ్డి జిల్లాల్లో చిరుత సంచారం కలకలం రేపుతోంది. చిరుతల ఆనవాళ్లు గుర్తించి ప్రజలు భయాందోళనకు గురవుతున్నరు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం కామారం తండా శివారులో చిరుతపులి సంచారం స్థానికంగా కలకలం సృష్టించింది. గురువారం సాయంత్రం తండా శివారులోని గుట్టపై చిరుత కనపడినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే గత గొద్దిరోజులుగా గుట్ట మీద చిరుతపులి స్థావరం ఏర్పర్చుకుందని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చిరుతపులి సంచరిస్తున్న ఫొటోలు, వీడియోలను స్థానికులు అటవీ శాఖ అధికారులకు పంపారు. చిరుతతో పాటు మరో రెండు చిన్న పిల్లలు కూడా ఆ ప్రదేశంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. చిరుత సంచారంతో తండా పరిసర ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. తమ గ్రామాల్లోకి వచ్చి దాడులు చేస్తాయేమోనని బిక్కుబిక్కు మంటూ బతుకుతున్నామని వారు చెబుతున్నారు. అయితే ఈ విషయాన్నిఅటవీ శాఖ అధికారులు ఇంకా ధృవీకరించలేదు. ఇకపోతే కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం బ్రహ్మనపల్లి గ్రామంలో చిరుత సంచారం కలకలం రేపింది. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలోని వ్యవసాయ పొలాల వద్ద చిరుత ఆనవాళ్లు కనిపించాయి. చిరుతను పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు ప్రత్యేక బోనును ఏర్పాటు చేశారు.

డ్రగ్స్ వ్యవహారంలో నటి రాగిణి అరెస్ట్

-మాదకద్రవ్యాల కేసులో ప్రశ్నిస్తున్న సిసిబి పోలీసులు

బెంగళూరు,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): కన్నడ నటి రాగిణిని బెంగళూరులోని సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) శుక్రవారం ఉదయం అదుపులోకి తీసుకున్నది. అనంతరం ఆమెను తమ కార్యాలయానికి తరలించింది. ఆ రాష్ట్రంలో మాదకద్రవ్యాల కేసులో సీసీబీ అధికారులు రాగిణిని ప్రశ్నిస్తున్నారు. దీని కోసం గురువారం ఆమెకు సమన్లు కూడా పంపారు. కన్నడ సినీ పరిశ్రమలో డ్రగ్స్ అంశం కలకలం రేపుతున్నది. చిత్ర పరిశ్రమకు చెందిన కొందరు మాదకద్రవ్యాల వాడకంపై నిర్మాత ఇంద్రజిత్ లంకేష్ ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ అధికారులు ఇటీవల ఆయనను పిలిపించి దీని గురించి ఆరా తీశారు. ఆయన చేసిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను తమకు అందించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఇంద్రజిత్ లంకేష్ గురువారం మరోసారి సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ కార్యాలయానికి వెళ్లారు. గతంలో ఆయన చేసిన వ్యాఖ్యలకు సంబంధించి పలు వివరాలు తెలుపడంతో పాటు కొన్ని ఆధారాలు సమర్పించినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో నటి రాగిణికి సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు గురువారం సమన్లు జారీ చేశారు. డ్రగ్స్ వ్యవహారానికి సంబంధించిన దర్యాప్తు కోసం శుక్రవారం తమ కార్యాలయానికి రావాలంటూ నోటీసులు పంపారు. అలాగే రాగిణి స్నేహితురాలు, చిత్ర పరిశ్రమతో సంబంధం లేని ఒక యువతిని కూడా గురువారం సీసీబీ అదుపులోకి తీసుకున్నది.

నకిరేకల్ పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే చిరుమర్తి

నల్లగొండ, సెప్టెంబర్ 4: నకిరేకల్ పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. నకిరేకల్ పట్టణం డాక్టర్స్ కాలనీ, సుందరయ్యనగర్ లలో ఎమ్మెల్యే పర్యటించారు. కాలనీల్లో ఉన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నకిరేకల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. సుందరయ్య నగర్, డాక్టర్స్ కాలనీ మధ్యలో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువ, నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

కర్కశంగా వ్యవహరించిన కన్నతండ్రి

అప్పుడే పుట్టిన ఆడ కవలలపై విషప్రయోగం
ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స
తండ్రిని అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్,సెప్టెంబర్4 (ఆర్ఎన్ఎ): పుట్టబోయేది ఆడపిల్ల అని తెలిస్తేచాలు.. ఆ పిండాన్ని తల్లి గర్భంలోనే చిధిమేస్తున్నారు కొందరు తల్లిదండ్రులు. ఆ గండాన్ని దాటుకొని భూమి మీదికి వచ్చిన తర్వాత ఆ పసిప్రాణాలను అనంత లోకాలకు పంపిస్తున్నారు మరికొందరు. తాజాగా మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగింది.

ఒకే కాన్పులో ఇద్దరు ఆడపిల్లలు జన్మించడంతో తట్టుకోలేక ఆ శిశువులకు విషమిచ్చాడో తండ్రి. ఈ విషాద సంఘటన గండేడ్ మండలంలో చోటుచేసుకున్నది. అప్పుడే పుట్టిన కవల పిల్లలపై ఆ తండ్రి కర్కశంగా వ్యవహరించాడు. మళ్లీ ఆడపిల్లలు పుట్టారని వారిని అంతం చేసే ప్రయత్నం చేశాడు. తల్లిపాలకు బదులు పురుగుల మందు తాగించాడా తండ్రి. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండేడు మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. దేశాయిపల్లి గ్రామానికి చెందిన కృష్ణవేణి అనే మహిళను ప్రసవం కోసం ఈనెల ఒకటో తేదీన కోస్గిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అదే రోజు రాత్రి ఆమె ఇద్దరు కవలలకు జన్మనిచ్చింది. మొదటి కాన్పులో ఆడపిల్ల కావడం.. ఇప్పుడు కూడా ఇద్దరు ఆడశిశువులు జన్మించడంతో ఎలాగైనా వారిని వదిలించు కోవాలని తండ్రి కేశవులు భావించాడు. రెండో కాన్పులోనూ కవల ఆడశిశువులే పుట్టారని కేశవులు ఆవేదన చెందాడు. భార్యకు తెలియకుండా ఇద్దరు శిశువులకు పురుగులమందు తాగించాడు. పిల్లల నోటిలోంచి నురగ రావడం గమనించిన కుటుంబసభ్యులు వైద్యులకు తెలిపారు. వారిపై విషప్రయోగం జరిగిందని వైద్యులు చెప్పడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. కవలల పరిస్థితి విషమంగా ఉందని జిల్లా వైద్యులు తెలిపారు. దీనిపై కోస్గీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కాగా.. కేశవులు పురుగుల మందు డబ్బా కొనుగోలు చేసిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో నమోదయ్యాయి. కేసు నమోదు చేసిన పోలీసులు.. కేశవులును అదుపులోకి తీసుకున్నారు.

కెసిఆర్ కృషితో ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్

-బ్రాండ్ ఇమేజ్ పెరిగిందన్న మంత్రి శ్రీనివాసగౌడ్

హైదరాబాద్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధిచేయడం వల్లనే ఇప్పుడు ఐటీ, ఫార్మా ఎగుమతులకు ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యకేంద్రంగా మారిందని పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం పర్యాటకశాఖ అభివృద్ధిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కోవిడ్-19కు ముందు హైదరాబాద్ సిటీకి ఉన్న బ్రాండింగ్ వల్ల గ్లోబల్ కాన్ఫరెన్స్‌లకు వేదికగా హైదరాబాద్‌నగరం నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అంతర్జాతీయస్థాయి సమావేశాలు, ఎగ్జిబిషన్‌లు నిర్వహించామన్నారు. నగరానికి ఉన్న బ్రాండింగ్‌ను దృష్టిలో పెట్టుకునే ఎంఐసిఈ టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. మీటింగ్స్, ఇన్‌సెంటివ్స్, కాన్ఫరెన్స్, ఎగ్జిబిషన్స్(ఎంఐసిఈ) టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రపంచంలో గొప్పనగరాలైన లండన్, ప్యారిస్, న్యూయార్క్, సిడ్నీ, బీజింగ్, టోక్యో, దుబాయ్ సరసన హైదరాబాద నగరాన్ని తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ అనుసరిస్తున్ననూతన విధానాల వల్ల అంతర్జాతీయ కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టుబడి పెడుతున్నాయని అన్నారు. ఈ సమావేశంలో పర్యాటక, సాంస్కృతికశాఖ కార్యదర్శి కెఎస్ శ్రీనివాస్‌రాజు, టూరిజం ఎండి మనోహర్, హెచ్‌సివిబి సీఈవో జలీల్‌ఖాన్, హచ్‌సివిబి హైదరాబాద్ ప్రెసిడెంట్ ఇయాన్‌దుబిర్, మేనేజర్ పార్వతిబాయి పాల్గొన్నారు.

మహిళల రక్షణే ధ్యేయంగా పటిష్ట చర్యలు : ఎస్పీ ఏవీ ర